వుదయం

మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్

మహాదేవపూర్ : అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల ఆశయాలను నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్ అన్నారు మహాదేవపూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో శనివారం భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇరువురు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. దేశ అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న కీలక నిర్ణయాలు, ప్రజల సంక్షేమానికి చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ఆమె చేసిన త్యాగాలు మరువలేనివని అన్నారు. ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అదే క్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి భారతదేశ ఐక్యతకు బలమైన పునాది వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషి భారతీయులందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వామన్ రావు గుడాల శ్రీను, ఆశ్రర్ ఖురేషి, ఆకుల రాజయ్య, బుర్రి శివరాజ్ మోతె సాంబయ్య రాఘవేంద్ర మహమ్మద్ ముస్తాక్, మహమ్మద్ బిన్ ఆలీ, గట్టు స్వామి,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి ఆయారాం గాయారాం ముఖ్యమంత్రులల్లో ఒక్కడు ఈ రేవంత్ రెడ్డి

సీఎం పదవి రెన్యూవల్ కోసమే ఢిల్లీ వెళ్ళిన రేవంత్ రెడ్డి
ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు తీరని అన్యాయం
మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 31(వుదయం జిల్లా ప్రతినిధి):

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని,పాలనపై దృష్టి పెట్టకుండా డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి తీవ్రంగా విమర్శించారు శనివారం భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16,28 వార్డులు రాంనగర్, సుభాష్ కాలనికి చెందిన దాదాపు 100 మంది యువకులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వారికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాపించిన స్వేరో సంస్థ యొక్క ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నవంబర్ 22న హన్మకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సందర్భంగా ఇట్టి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ అనేక సంవత్సరాలు ఈ దేశాన్ని, ఈ రాష్ట్రాన్ని పరిపాలన చేసిన చరిత్ర మాది మాకు ఒక్క అవకాశం ఇవ్వమని కోరితే, ప్రజలు వారికీ అవకాశం ఇచ్చారు.అవకాశం ఇస్తే అభివృద్ధి చేయాల్సింది పోయి, అధికార దుర్వినియోగం చేస్తున్నరన్నారు అని ఆరోపించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పరిపాలనపై దృష్టి పెట్టకుండా తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని, రాష్ట్రంలో అనేక సమస్యలు పేరుకుపోయినా వాటిని పరిష్కరించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదన్నారు. భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు ఉండగా, కరువు మండలాల ప్రకటనలో అర్హత ఉన్న ప్రాంతాలను పక్కనపెట్టి రాజకీయ ప్రాతినిధ్యాలు, మంత్రుల సూచనల మేరకు ఎంపిక చేశారని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగేలా కరువు మండలాల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 550 ఎకరాల భూమికి సంబంధించిన సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అన్నారు. హైడ్రా, ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ వంటి అంశాల పేరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అభివృద్ధి పేరుతో ప్రజలకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు, చిరు వ్యాపారులకు తగిన పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు కల్పించాలని డిమాండ్ చేశారు.సింగరేణి ప్రాంతంలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెడికల్ బోర్డుల ద్వారా న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని, తీవ్రమైన అనారోగ్య సమస్యలున్న వారిని కూడా అన్‌ఫిట్‌గా ప్రకటించకుండా సర్ఫేస్ విధుల్లో కొనసాగించడం కార్మికుల జీవితాలతో చెలగాటమాడటమేనని అన్నారు. రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు, సింగరేణి కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని అన్నారు. నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో ఇంకా నమోదు చేసుకోని పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తమ తీర్పును తెలియజేసేందుకు పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జీ, ఒడిసిఎంఎస్ మాజీ చైర్మన్ రామస్వామి నాయక్ మరియు భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరా గాంధీకి ఘన నివాళి

ఆమె నిర్ణయాలు దేశ ప్రగతికి నాంది
– తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు

హనుమకొండ సిటీ, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

దేశ సమగ్రత, సార్వభౌమాధికారం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన ఉక్కు మహిళ, భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా హనుమకొండలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిండ్ల రాజు, సత్తు రమేష్, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా మామిండ్ల రాజు మాట్లాడుతూ... పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రవేశపెట్టిన 'ఇరవై సూత్రాల పథకం', 'బ్యాంకుల జాతీయకరణ' వంటి సాహసోపేత నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపాయని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో చెరగని ముద్ర వేసిన ఇందిరా గాంధీ గారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు,

మాజీ అధ్యక్షులు అంకేశ్వర్ సురేందర్, కనుకుంట్ల కృష్ణ, వెల్దండి రమేష్, డిసిసి మెంబర్ సురేష్‌లతో పాటు పలువురు సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో జోరుగా పాల్గొనాలి

31వ డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు
అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలి:
పశ్చిమ నియోజకవర్గంలో ఊపందుకున్న పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

హనుమకొండ సిటీ, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 31వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మరియు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, 31వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్, డివిజన్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ మామిండ్ల సురేష్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ తిరిగారు. డివిజన్‌లోని అర్హులైన ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కనుకుంట్ల కృష్ణ, మంద సునీల్, శీలం శ్రీనివాస్, బొల్లం పున్నంచందర్, కాయిత అనిల్, పిండి మహేష్, పిన్నింటి మధు, కోరిగొప్పల సంజయ్, వస్కుల వినయ్, రాసమల్ల సతీష్, ఆరెల్లి అభిలాష్, పిండి హరీష్, వెల్దండి శంకర్, సంతోష్, మాచర్ల అనిల్ తో పాటు సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌చార్జులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గీత కార్మికుల భార్యలకు తక్షణ పెన్షన్ విధానం హర్షణీయం

మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్

హనుమకొండ టౌన్, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

గీత కార్మికులు మరణిస్తే వారి భార్యలకు వెంటనే పెన్షన్ అందించే విధానాన్ని (ఇన్‌స్టంట్) అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. శనివారం హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుడు మరణించిన తర్వాత అతని భార్య తిరిగి పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన విధానాన్ని తొలగించాలని గత కొన్నేళ్లుగా పలు గౌడ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాయని తెలిపారు. గౌడ సంఘాల డిమాండ్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, గీత కార్మికులు మరణిస్తే వారి భార్యలకు పెన్షన్ అందించే నిర్ణయం తీసుకోవడం పట్ల మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ తరఫున అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 37,381 మంది గీత కార్మికులకు ఎలాంటి షరతులు విధించకుండా వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, గీత కార్మికుడు మరణించినప్పుడు అతని భార్య తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మోకుదెబ్బ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తోటకూరి రాందాస్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వల్లాల సదానందం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మగాని శ్యామ్ సుందర్ గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి గడ్డమీది అశ్విన్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి రడం శ్రీనివాస్ గౌడ్,

హనుమకొండ పట్టణ గౌరవ అధ్యక్షుడు జూలూరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సమైక్య భారత నిర్మాణంలో వల్లభాయ్ పటేల్ సేవలు అజరామరం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నవీన్

హనుమకొండ,అక్టోబర్31 (వుదయం విలేకరి):

స్వతంత్ర భారత నిర్మాణానికి సమర్థమైన పరిపాలన దక్షతను, వాస్తవిక దృక్పథాన్ని ప్రదర్శించ కలిగిన నాయకుడు, సమైక్య భారత నిర్మాణంలో ఆయన చూపిన రాజ నీతిజ్ఞత భారతీయులకు నిరంతర ప్రేరణ ఇవ్వగలదని, ఆధునిక భారతదేశ చరిత్రలో మహాత్మా గాంధీ ఆదర్శ ప్రధాతగా, నెహ్రూ భావుకుడిగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ కార్యాచరణ దక్షుడిగా నిలిచారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు.శనివారం నాడు హనుమకొండ ఎక్సైజ్ కాలనీ లోని డాక్టర్ అంపశయ్య నవీన్ గ్రంథాలయంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన, 31 వ తారీఖు నాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని, ఏక్తా దివస్ ను పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా అభియాన్ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ నేతృత్వంలో ప్రచురించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఏకత అభియాన్ కన్వీనర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్, మహాత్మా గాంధీ ఆశయానికి ఒక కార్యాచరణ విధానాన్ని రూపొందించడమే కాక, మధ్యయుగాల మనస్తత్వంతో మనుగడ సాగించు సంస్థానాధిపతులలో దేశభక్తిని ప్రబోధించి సమైక్య భారత రాజ్య నిర్మాణం చేసి ఆధునిక భారత చరిత్రలో చిరుయశస్సు గడించారనీ. శతాబ్దాలుగా అర్థ బానిసత్వంలో నిరంకుశత్వం కింద మగ్గుతున్న 544 సంస్థానాల ప్రజలను స్వతంత్ర భారత్ లో విలీనం చేయడం ద్వారా వారికి విముక్తిని ప్రసాదించడం పటేల్ జీవితానికి మణికిరీటం అని, మహాభారత కాలంలో శ్రీ కృష్ణుని వలె సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర పోరాట కాలంలో కాంగ్రెస్ సంస్థ క్రమశిక్షణకు, స్వాతంత్ర్యనంతర సమైక్య భారత నిర్మాణానికి ఎదురు నిలిచిన వారిని ఓడించడంలో రాజకీయ రంగం నుండి నిష్క్రమింపచేయడంలో గొప్ప రాజనీతిని అనుసరించినాడని అన్నారు.

ఈ కార్యక్రమంలో దొంగరి శశికిరణ్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ లతో పాటు సాహితీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం.. సర్దార్ పటేల్ ఆశయాలు స్ఫూర్తిదాయకం!

రాయపర్తి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.శనివారం రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ 42వ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ తొలి మహిళా ప్రధానిగా ఆమె అందించిన సేవలను, దేశ అభివృద్ధి కోసం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలను, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు.దేశ రాజకీయాల్లో ధైర్యసాహసాలతో తనదైన ముద్ర వేసిన ఇందిరాగాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.అనంతరం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.స్వాతంత్ర్యానంతరం దేశంలోని సంస్థానాలను ఏకీకృతం చేసి భారతదేశ సమగ్రతకు బలమైన పునాదులు వేసిన పటేల్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.జాతీయ సమైక్యత, సమగ్రత, ఐక్యత కోసం ఆయన చూపిన దృఢ సంకల్పం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, వర్ధన్నపేట ఏఎంసీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం గౌరవ సలహాదారు గారే సహేంద్ర బిక్షపతి, మండల ఉపాధ్యక్షులు మచ్చ నీలయ్య, గిరిగాని రాజు, మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ యాకూబ్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు నూనావత్ కిషన్ నాయక్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చేవ్వు కాశీనాథం, గ్రామ సర్పంచులు తీగల సాయిలు, రాయిని యాకయ్య, మండల నాయకులు రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఊళ్లెంగల నర్సయ్య, వీరయ్య, దూరశెట్టి రమేష్, ఓరుగంటి వెంకన్న, షేక్ రఫీ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టబద్రులందరూ నవంబర్ 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలి.

మీసేవ కేంద్రాల్లో గాని, పార్టీ ఏర్పాటు చేసిన ఆన్లైన్ కేంద్రం వద్ద ఓటును నమోదు చేసుకోవాలి.
ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి ఆబోత అశోక్ యాదవ్.

ఖానాపురం, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

పట్టభద్రులందరూ నవంబర్ 6 లోపు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు చేసుకోవాలని లేదంటే నవంబర్ 6 దాటితే ఓటు నమోదు చేసుకుని అవకాశం కోల్పోయి ఓటు వేసే అవకాశం పట్టభద్రులకు ఉండాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి ఆబోతు అశోక్ యాదవ్ పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులందరూ త్వరగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదును మీ సేవ కేంద్రం వద్ద పార్టీ ఏర్పాటు చేసిన ఆన్లైన్ కేంద్రం వద్ద గాని ఆయా గ్రామాల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జిలకు ఆయా గ్రామాల పట్టభద్రులు ఓటుకు సంబంధించిన ధ్రువపత్రాలను అందజేస్తే వెంటనే పార్టీ ఏర్పాటు చేసిన ఆన్లైన్ కేంద్రం వద్ద ఉచితంగా ఓటు నమోదు చేస్తున్నట్లు పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి తెలుపుతూ, నవంబర్ 6 లోపు మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల గ్రామ ఇంచార్జ్ ఆబోతు అశోక్ యాదవ్ పట్టభద్రులకు పిలుపునిచ్చారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

– జెడ్పీహెచ్ఎస్‌లో పొగాకు వ్యతిరేక అవగాహన సదస్సు
– పాల్గొన్న డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

నడికూడ, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ, పొగాకు రహిత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ అప్పయ్య పిలుపునిచ్చారు. 'జాతీయ పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం - 4.0'లో భాగంగా నడికూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. పొగాకు, గుట్కా, ఖైనీ, సిగరెట్లు, బీడీల వినియోగం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు వస్తాయని హెచ్చరించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మురళి, డాక్టర్ దివ్య, ఎంపీహెచ్ఈఓ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్‌కు ఘన నివాళులు అర్పించిన బిజెపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి.

నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

ఉక్కు మనిషి, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 560 సంస్థానాలను ఏకం చేసి భారతదేశ సమైక్యతకు పునాది వేసిన మహనీయుడు సర్దార్ పటేల్ అని కొనియాడారు. ఆయన దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యతా భావాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కట్ల రామచందర్ రెడ్డి, గూడూరు సందీప్, తనుగుల అంబేద్కర్, జూలూరు మనీష్ గౌడ్, జుర్రు రాజు, జిరుపుల వీరన్న, అచ్చ దయాకర్, సూత్రపు సరిత తదితర బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర నాయకుడు మేకల రవికి ఘన నివాళులు

భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

సీపీఐ రాష్ట్ర నాయకులు మేకల రవి మృతి పట్ల పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన మాజీ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ గుప్తా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేకల రవి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని వారు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేకల రవికి నివాళులర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

శ్రీ

కనకదుర్గ ఆలయానికి

కాజీపేట, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

మడికొండలోని శ్రీ కనకదుర్గ దేవాలయానికి నూతన మున్సిపల్ నల్లా కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం దేవాలయ అవసరాల కోసం ప్రత్యేక మున్సిపల్ నీటి కనెక్షన్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆలయంలో నిత్య పూజలు, అభిషేకాలు, భక్తుల అవసరాలు, ప్రాంగణ పరిశుభ్రతకు నిరంతర నీటి సరఫరా అవసరమని కమిటీ ప్రధాన కార్యదర్శి పల్లపు అశోక్ కమిషనర్ కు తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో ఆలయ కమిటి సభ్యులు చీకటి రాజు, బల్సుకురి రాజ్ కుమార్, దువ్వ సందీప్, దువ్వ సాయికుమార్ తదితరులు ఉన్నారు.

మండల వ్యాప్తంగా అన్నిగ్రామాలలో పశువుల తొట్టెల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలి



మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత.

ఖానాపురం, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి);

మండలంలోని ఇరవై ఒక్క గ్రామ పంచాయతీల పరిధిలోని పశువుల తొట్టెల నిర్మాణానికి స్థలాలను గుర్తించి వెంటనే పనులను ఆయా గ్రామాల సర్పంచులు కార్యదర్శులు పాలకవర్గం సమన్వయతో పనులు ప్రారంభించాలని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో నీటి సమస్యలు విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున కనీసం పశువుల తొట్టెల నిర్మాణం పూర్తి చేస్తే నీటిని నిలువ చేసుకునే అవకాశం ఉంటుందని అట్టి నీటిని పశువులు తాగే అవకాశం ఉంటుందని తెలుపుతూ, త్వరగా మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో పశువుల తొట్టెల నిర్మాణానికి స్థలాలను గుర్తించి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల సర్పంచులకు కార్యదర్శులకు ఎంపీడీవో తెలిపారు.

ధన్వాడకు నేడు గణపతి సచ్చిదానంద స్వామీజీ రాక

భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి
కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య

మహాదేవపూర్: అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, అవధూత దత్త పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ కాటారం మండలంలోని ధన్వాడ గ్రామానికి విచ్చేయనున్నట్లు కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు స్వామీజీ ఆదివారం ఉదయం9 గంటలకు ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని, అనంతరం భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పేర్కొన్నారు.ఈ పవిత్ర కార్యక్రమానికి గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామీజీ

ఆశీస్సులు పొంది, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుర్గయ్య కోరారు.

తక్కువ తూకంతో విక్రయిస్తే కఠిన చర్యలు

బియ్యం, కిరాణా దుకాణాల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు.
నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 10 కేసులు నమోదు.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

వినియోగదారులకు సరుకులను నిర్ణీత తూకం కంటే తక్కువగా విక్రయిస్తూ మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు.

వరంగల్ పట్టణంలోని పలు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో శుక్రవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా బియ్యం బస్తాలను తూకం వేయగా, 26 కిలోలుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై మొత్తం 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారి కూచన మనోహర్ మాట్లాడుతూ, ప్రతి వ్యాపారి ప్యాకింగ్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, ప్యాకెట్లపై ప్రకటించిన బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని సూచించారు. బస్తాలపై పేర్కొన్న బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయిస్తే తూనికలు, కొలతల చట్టం ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,

వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

19వ రోజు నిరవధిక సమ్మెలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు లేక రోగులకు ఇబ్బందులు

- గ్రామీణ, మండల ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం
- ప్రభుత్వం వెంటనే స్పందించి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి

నల్లగొండ జిల్లా అక్టోబర్ 31వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణంలో కలెక్టర్ కార్యాలయం ముందు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మెతో గ్రామీణ, మండల స్థాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మండల ఆసుపత్రుల్లో కీలక సేవలు అందించే సిబ్బంది విధులకు దూరంగా ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకం. గర్భిణులకు వైద్య పరీక్షలు, చిన్నారులకు టీకాలు, ప్రాథమిక వైద్యం, దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు, ఆరోగ్య పర్యవేక్షణ వంటి అనేక సేవలను వీరు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో ఈ సేవలపై ప్రభావం పడుతోంది. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుత పరిస్థితి మరింత సమస్యాత్మకంగా మారింది. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలు జరపాలని, వారి సమస్యలకు పరిష్కారం చూపి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు యథావిధిగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డాక్టర్ దయానంద్, అకౌంటెంట్ అసిస్టెంట్ కరుణాకర్, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, ల్యాబ్ టెక్నీషియన్ తరాల సురేష్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ గణేష్, ఎండీ ఖలీల్, డాక్టర్ టి.రవి, ఆడియాలజీ విభాగానికి చెందిన అనిల్, బోడుపల్లి రమేష్‌తోపాటు ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం

- అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి
- ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనను వేగవంతం చేయాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ -31

నవంబర్ 6 తర్వాత కూడా వరంగల్–నల్గొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందని అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ తో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో మంచి పురోగతి సాధించారని అధికారులను అభినందించారు. అయితే నవంబర్ 6 చివరి తేదీగా భావించి రాజకీయ పార్టీల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, మరోవైపు అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా వేగవంతం కావాల్సి ఉందని అన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఫారం–18 దరఖాస్తుల స్వీకరణతో పాటు వాటి పరిశీలనను వేగవంతం చేయాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని, అదే తేదీన డిగ్రీ పరీక్షల ఫలితాలు ప్రకటించబడిన వారు కూడా అర్హులేనని తెలిపారు. ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ అందుబాటులో లేని సందర్భాల్లో సంబంధిత విద్యాసంస్థ అధిపతి ధృవీకరించిన సర్టిఫికెట్‌ను కూడా పరిశీలనకు స్వీకరించవచ్చని తెలిపారు. విద్యార్హత ధృవీకరణతో పాటు దరఖాస్తుదారుల సాధారణ నివాస స్థితిని క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్–2026 ప్రక్రియను అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సమర్థవంతంగా నిర్వహించిన తీరును అభినందించారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం బీఎల్ఓలందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో నివాస ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు నవంబర్ 6తో ముగిసిపోదని, ఆ తేదీ తర్వాత కూడా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల రూపంలో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు కూడా ఫారం–18 దరఖాస్తులు సమర్పించవచ్చని, నిబంధనల ప్రకారం వాటిని స్వీకరించడం జరుగుతుందని వివరించారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, పట్టభద్రులకు, క్షేత్రస్థాయి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు.

నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందనే సమాచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి నివాస స్థితిని ధృవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల కేటాయింపును కూడా ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని తెలిపారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఫారం–18 దరఖాస్తుల విచారణ బాధ్యతలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), సీనియర్ అసిస్టెంట్ కేడర్ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అందిన ఫారం–18 దరఖాస్తులను ప్రతిరోజూ డౌన్‌లోడ్ చేసుకొని పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధికారులు బూత్ స్థాయి అధికారుల సహకారంతో దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, వారు సంబంధిత ప్రాంతంలో సాధారణ నివాసితులుగా ఉన్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దరఖాస్తుల కేటాయింపు కోసం 118 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 6, 2026 వరకు అందే దరఖాస్తుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను నవంబర్ 10, 2026లోగా సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబర్ 25, 2026లోగా పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ డీ. వేణుగోపాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ మహేందర్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు..

సేవలను అభినందించిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

యాదాద్రి భువనగిరి, వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన శ్రీ మహేందర్ రెడ్డిని జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి, ఆయన పోలీస్ శాఖకు అందించిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, ప్రజల భద్రత కోసం అంకితభావంతో సేవలందించిన మహేందర్ రెడ్డి సేవలు అభినందనీయమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ లక్ష్మీనారాయణ కూడా మహేందర్ రెడ్డిని అభినందించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ తరపున ఏఎస్ఐ మహేందర్ రెడ్డికి పదవీ విరమణ శుభాకాంక్షలు.

ఆదర్శ రైతుకు గ్రామం ఘన అభినందన.. మూల వెంకటరెడ్డికి కిసాన్ మహారాజా అవార్డు

వ్యవసాయ రంగంలో విశేష సేవలకు దక్కిన గుర్తింపు

మునగాల, అక్టోబర్ 31 (వుదయం):

వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మునగాల మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన మూల వెంకటరెడ్డికి ప్రతిష్ఠాత్మక కిసాన్ మహారాజా అవార్డ్స్–2026 లభించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. సూర్యాపేట జిల్లా ఆదర్శ రైతుగా ఎంపికై ఈ పురస్కారాన్ని అందుకున్న వెంకటరెడ్డిని గ్రామ సర్పంచ్ కాంపాటి వెంకట్ అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో మూల వెంకటరెడ్డి అందిస్తున్న సేవలు, ఆయన అనుభవం, అంకితభావం గ్రామంలోని ఇతర రైతులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకొని నారాయణగూడెం గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిడి వీరబాబు, కొమ్ము మధుబాబు, సీపీఎం పార్టీ గ్రామ కార్యదర్శి గోపాల్ రెడ్డి, స్టాలిన్ రెడ్డి, సంజీవరావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని మూల వెంకటరెడ్డికి అభినందనలు తెలిపారు.

గెస్ట్ డిగ్రీ లెక్చరర్, స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం, 31/10/26 వుదయం ప్రతినిధి:

2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి గెస్ట్ డిగ్రీ లెక్చరర్, స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో అర్హతలు కలిగిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలనే ఉద్దేశంతో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం ప్రాంతీయ సమన్వయ అధికారి పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను 2026–27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆసక్తి, సంబంధిత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

రెండు పోస్టులు ఖాళీ

ఈ నియామక ప్రక్రియలో భాగంగా మొత్తం రెండు పోస్టులను భర్తీ చేయనున్నారు. TGTWRDC (M), మణుగూరులో గెస్ట్ డిగ్రీ లెక్చరర్ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పోస్టు ఒకటి, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (EMRS), టేకులపల్లిలో స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. సంబంధిత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

గెస్ట్ డిగ్రీ లెక్చరర్ పోస్టుకు విద్యార్హతలు

మణుగూరులోని TGTWRDC (M)లో ఖాళీగా ఉన్న గెస్ట్ డిగ్రీ లెక్చరర్ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ (PG) పూర్తి చేసి ఉండాలి. అదేవిధంగా సంబంధిత సబ్జెక్టులో NET లేదా SET అర్హత కలిగి ఉండాలి లేదా పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టుకు ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.32,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ దరఖాస్తులో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టుకు అర్హతలు

టేకులపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సైకాలజీ లేదా క్లినికల్ సైకాలజీలో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలి. అదేవిధంగా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా సంస్థ నుంచి గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో ఒక సంవత్సరం డిప్లొమా పూర్తి చేసి ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టుకు ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.35,400 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన కౌన్సెలింగ్, విద్యాపరమైన మార్గదర్శకత్వం అందించేందుకు సంబంధిత అర్హతలు కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ

ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతలు, సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించడంతో పాటు, అర్హతల ఆధారంగా మెరిట్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించిన అనంతరం అవసరమైన డెమో లేదా ఇంటర్వ్యూను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, అర్హత ధ్రువపత్రాల పరిశీలన, డెమో లేదా ఇంటర్వ్యూ తదితర అంశాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో అందించే సమాచారం సరైనదిగా ఉండాలని, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాలని సూచించారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు నవంబర్ 4 చివరి తేదీ

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఖమ్మం ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయానికి సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

దరఖాస్తుల సమర్పణకు సంబంధించిన వెబ్‌సైట్:

https://rcokhammam.free.nf/notifications/lab/index.html

ఆన్‌లైన్ దరఖాస్తులను 2026 నవంబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అర్హులైన అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు . దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవం, ఇతర సంబంధిత వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలి. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలి. నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

తప్పుడు సమాచారం ఇస్తే దరఖాస్తు తిరస్కరణ

దరఖాస్తులో తప్పుడు సమాచారం నమోదు చేసినా, నకిలీ ధ్రువపత్రాలను సమర్పించినా సంబంధిత అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, నిబంధనలను పూర్తిగా పరిశీలించిన అనంతరం మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో పొందుపరిచిన వివరాలకు సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

భద్రాద్రి దేవస్థానానికి రూ.1 లక్ష విరాళం.. గోశాల, అన్నదానానికి చెరో రూ.50 వేల సమర్పణ

అన్నదానం మహాదానం.. మూగజీవాల సేవ మహోన్నతం: దాతల సందేశం

భద్రాచలం 31/10/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ జి.ఎస్.పి. వీరరెడ్డి కుటుంబ సభ్యులు తమ వంతు సేవాభావంతో రూ.1,00,000 విరాళాన్ని అందజేశారు. ఇందులో గోశాల నిర్వహణ, గోవుల సంరక్షణ నిమిత్తం రూ.50,000, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు రూ.50,000 చొప్పున విరాళంగా సమర్పించారు. భగవంతునిపై భక్తి, సమాజంపై బాధ్యత, మూగజీవాల పట్ల ప్రేమాభిమానాలను చాటుకుంటూ వీరరెడ్డి కుటుంబ సభ్యులు చేసిన ఈ సేవాభావపూర్వకమైన దాతృత్వం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన శ్రీ జి.ఎస్.పి. వీరరెడ్డి కుటుంబ సభ్యులు భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానానికి ఈ విరాళాన్ని అందించడం విశేషం. భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందించే అన్నదాన కార్యక్రమానికి, గోవుల సంరక్షణకు తమ వంతు సహకారం అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవతో పాటు జీవకారుణ్యాన్ని కూడా వారు చాటుకున్నారు. అన్నదానం మహాదానం.. ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు భద్రాద్రి రామయ్య సన్నిధిలో అన్నదానానికి, గోశాల సేవకు విరాళాలు అందించడం ద్వారా శ్రీ జి.ఎస్.పి. వీరరెడ్డి కుటుంబ సభ్యులు భక్తిభావంతో కూడిన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. వారి కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, శ్రీ సీతారామచంద్రస్వామివారి దివ్య కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ వారిపై ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులు

మధిర, అక్టోబర్,31, వుదయం, ప్రతినిధి:

మధిర మండలం మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరుకానున్న 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి చెరుపల్లి శ్రీహరి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి కఠినమైన పోటీ పరీక్షలనైనా సులభంగా ఎదుర్కొని విజయం సాధించవచ్చని అన్నారు. అనంతరం గత సంవత్సరం మాటూరు పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులు పూల జస్వంత్, వేముల నరసింహారావు తమ ఆర్థిక సహకారంతో పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, స్కేలులు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు తదితర పరీక్ష సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. చిన్న వయసులోనే దాతృత్వ భావనతో తోటి విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమని ఎంఈఓ శ్రీహరి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం శిక్షణ అందించిన గణిత ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు చౌడవరపు సునీత, జీవశాస్త్ర ఉపాధ్యాయులు షేక్ లాల్ అహ్మద్‌లను ప్రశంసించారు. మాటూరు ఉన్నత పాఠశాల, మాటూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూనే, మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టినప్పటికీ ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రత్యేక శిక్షణ అందించిన చెరుపల్లి శ్రీహరికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, లావుడ్య రవికుమార్, ఎం.పి.వి.ఎ. ఎస్.వి. ప్రసాద్, షేక్ లాల్ అహ్మద్, ఎం. రవి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ

- భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో 3 నుంచి 4 నెలల పాటు శిక్షణ కార్యక్రమాలు
- శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్
- 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి: ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

భద్రాచలం,31/10/26 వుదయం ప్రతినిధి

గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) భద్రాచలం ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఈ శిక్షణ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

భద్రాచలంలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో మూడు నుంచి నాలుగు నెలల పాటు వివిధ రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను యువత అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని, ఈ దిశగా గిరిజన యువతకు ఉపయోగపడే పలు కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిక్షణ పొందాలని ఆయన సూచించారు.

ఉచిత శిక్షణలో వివిధ కోర్సులు

గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల విద్యార్హతలు, వయోపరిమితి ఆధారంగా వివిధ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. స్వయం ఉపాధితో పాటు సాంకేతిక, సేవా రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడేలా ఈ కోర్సులను రూపొందించారు.

1. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టైలర్ కోర్సు: మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ కోర్సును నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే మహిళలు కనీసం ఐదో తరగతి లేదా ఆపై చదివి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. కుట్టుపని నేర్చుకొని స్వయంగా ఉపాధి పొందాలనుకునే మహిళలకు ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుంది.

2. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు: సాఫ్ట్‌వేర్ రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలనుకునే యువతీ యువకులకు ఈ కోర్సులో శిక్షణ అందించనున్నారు. దరఖాస్తుదారులు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. సాంకేతిక రంగంలో భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను అన్వేషించాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

3. సీఎంఆర్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సు: మహిళలు, పురుషులు ఇద్దరూ ఈ కోర్సుకు అర్హులు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ చదివి ఉండటంతో పాటు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. నిర్దేశించిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు.

4. గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సు: సేవా రంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే మహిళలు, పురుషులకు ఈ కోర్సు ద్వారా శిక్షణ అందించనున్నారు. పదో తరగతి లేదా ఆపై విద్యార్హత కలిగి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

5. ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటర్ అండ్ పెరిఫెరల్స్ కోర్సు: కంప్యూటర్లకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలనుకునే మహిళలు, పురుషులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి లేదా ఆపై చదివి ఉండాలి. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. కంప్యూటర్ పరికరాలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ శిక్షణ దోహదపడుతుంది.

6. డ్రోన్ సర్వీసెస్ టెక్నీషియన్ కోర్సు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా డ్రోన్ సేవలకు సంబంధించిన నైపుణ్యాలను నేర్చుకోవాలనుకునే మహిళలు, పురుషులకు ఈ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. పదో తరగతి లేదా ఆపై చదివి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత సౌకర్యాలు

ఈ శిక్షణ కార్యక్రమాల్లో చేరే అర్హులైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసిన అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా నైపుణ్య శిక్షణ పొందలేకపోతున్న గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఈ కార్యక్రమాలు మంచి అవకాశంగా నిలవనున్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న కోర్సును ఎంచుకొని శిక్షణ పొందడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.

నవంబర్ 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

ఈ ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో భద్రాచలంలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో 2026 నవంబర్ 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కోరారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, విద్యార్హతలకు సంబంధించిన పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన వివరాలను సమర్పించి, తమ విద్యార్హతలు, వయస్సుకు అనుగుణంగా అర్హత కలిగిన కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

📞 9347466615
📞 9441390232

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని అర్హులైన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, శిక్షణ ద్వారా భవిష్యత్తులో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల దిశగా ముందడుగు వేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలంలో పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

- నవంబర్ 7 వరకు ప్రవేశాలకు అవకాశం
- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్

భద్రాచలం, 31 /10/26 వుదయం ప్రతినిధి

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ విద్యను అభ్యసించాలనుకునే అర్హత కలిగిన విద్యార్థులకు ఈ ప్రవేశాలు మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యను కొనసాగించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆరు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి అనుగుణంగా వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో ఎం.ఎస్సీ కెమిస్ట్రీ, ఎం.ఎస్సీ ఫిజిక్స్, ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. ఇంగ్లీష్, ఎం.ఏ. ఎకనామిక్స్, ఎం.కామ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే ఆసక్తి కలిగిన విద్యార్థులు నిర్దేశించిన అర్హతలను పరిశీలించుకుని అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

TG CPGET–2026 నిబంధనల ప్రకారం ప్రవేశాలు

తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (TG CPGET–2026) నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు తమ అర్హతలు, ప్రవేశానికి అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుని కళాశాలను సంప్రదించాలని తెలిపారు.

నవంబర్ 7 చివరి తేదీ

పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు పొందేందుకు 2026 నవంబర్ 7వ తేదీని చివరి తేదీగా నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ వెల్లడించారు.

అవసరమైన ధ్రువపత్రాలు ఇవే

స్పాట్ అడ్మిషన్ల సమయంలో విద్యార్థులు కింది ధ్రువపత్రాలను ఒరిజినల్స్‌తో సహా సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

1. TG CPGET–2026 ర్యాంక్ కార్డు.
2. ఎస్ఎస్‌సీ మార్కుల మెమో.
3. ఇంటర్మీడియట్ మార్కుల మెమో.
4. డిగ్రీ ఒరిజినల్ లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్.
5. డిగ్రీ కన్సాలిడేటెడ్ మార్కుల మెమో.
6. స్టడీ సర్టిఫికెట్లు.
7. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (TC).
8. కుల ధ్రువీకరణ పత్రం (వర్తించినట్లయితే).
9. నివాస ధ్రువీకరణ పత్రం.
10. ఈక్వివలెన్స్ సర్టిఫికెట్ (వర్తించినట్లయితే).

ప్రవేశ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులు పైన పేర్కొన్న ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. సంబంధిత పత్రాలను సమర్పించే విషయంలో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఎండిన పంటలపై వ్యవసాయ శాఖ ప్రత్యేక సర్వే

- నవంబర్ 2 నుంచి 7 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన
- అర్హులైన రైతుల జాబితా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శన

మునగాల, అక్టోబర్ 31 (వుదయం):

2026–27 సంవత్సరానికి గాను మునగాల మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా గుర్తించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ పంట నష్టంపై ప్రత్యేక సర్వే చేపట్టనుంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి బుంగరాజు వెల్లడించారు. నీటి కొరత కారణంగా ఎండిపోయి 33 శాతానికి పైగా పంట నష్టం జరిగిన పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) నవంబర్ 2వ తేదీ సోమవారం నుంచి 7వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. నిజంగా పంట నష్టపోయిన రైతులను గుర్తించి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేస్తారు. అనంతరం నవంబర్ 9వ తేదీలోగా సంబంధిత గ్రామపంచాయతీల్లో రైతుల జాబితాను ప్రదర్శిస్తారు. ఆ జాబితాపై రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, నవంబర్ 10వ తేదీలోగా అవసరమైన మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను ప్రభుత్వానికి ప ంపించ ను న్నారు. కావున నీటి కొరతతో ప ంట లు ఎండిపోయి

నష్టపోయిన రైతులందరూ తమ గ్రామాలకు వ్యవసాయ విస్తరణ అధికారులు వచ్చినప్పుడు ఎండిపోయిన పంట పొలాలను చూపించి, సర్వేకు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి బుంగరాజు కోరారు.

సూర్యాపేటలో 657 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట అక్టోబర్ 31
వుదయం ప్రతినిధి

అర్హులైన ప్రతి పేదవానికి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 319 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 657 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, 100రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. బేస్‌మెంట్, లింటెల్, రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రతి దశలో నిర్మాణ ఫొటోలను అధికారులకు అందజేయాలని సూచించారు. వచ్చే జనవరి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు. జిల్లా యంత్రాంగం, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఇళ్ల మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, అవకతవకలను సహించబోమని హెచ్చరించారు.

ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీకి 657 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ సహకారంతో పథకం అమలవుతోందని చెప్పారు. గతంలో మాజీ మంత్రి దివంగత దామోదర్ రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న వారు ఇప్పటికీ సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇళ్లు మంజూరైన వారు కూడా నాణ్యమైన ఇళ్లు నిర్మించుకుని కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఇళ్ల నిర్మాణాలతో మేస్త్రీలు, కూలీలు, సెంటరింగ్, నిర్మాణ సామగ్రి వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు.

సూర్యాపేట మున్సిపల్ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 3,100 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, అర్హులకు త్వరలో పెన్షన్లు అందిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పీడీ హౌసింగ్ జబ్బర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఏఎంసీ వైస్ చైర్మన్ గట్టు శ్రీను, ఫ్లోర్ లీడర్ వేణు గోపాల్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల ప్రభుత్వ సేవకు వీడ్కోలు

- భూగర్భ శాఖలో 40 ఏళ్లపాటు విశిష్ట సేవలు
- ఆకునూరి లక్ష్మయ్య మట్టమ్మ

నల్గొండ జిల్లా
అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో భూగర్భ శాఖలో నాలుగు దశాబ్దాలపాటు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఆకునూరి లక్ష్మయ్య సూపరింటెండెంట్ హోదాలో నల్లగొండలో పదవీ విరమణ చేయనున్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో తన అనుభవం, అంకితభావం, క్రమశిక్షణతో శాఖకు విశిష్ట సేవలందించారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో తనవంతు బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ విధుల పట్ల నిబద్ధతతో పనిచేశారు. సహచర ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ తన అనుభవంతో పలువురికి మార్గదర్శకంగా నిలిచారు. సూపరింటెండెంట్ హోదాలో పదవీ విరమణ చేయడం ఆయన ఉద్యోగ ప్రస్థానంలో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది. ఈ సందర్భంగా జిల్లా భూగర్భ శాఖ అధికారి పెరుమాండ్ల జ్యోతికుమార్, అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్టులు ఆర్.మానస, అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్టులు కె.రజిని, అసిస్టెంట్ జియోఫిజిసిస్ట్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాకేశ్, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, శాఖ సిబ్బంది, తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ఎల్నినో ఎఫెక్ట్‌ను తట్టుకొని బొప్పాయి పంట సాగు.. డ్రిప్‌తో రూ.2.10 లక్షల నికర ఆదాయం

సూర్యాపేట అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

ఓ వైపు ఎండలు.. మరోవైపు వర్షాభావ పరిస్థితులు.. ఇంకోవైపు సాగునీటి కొరత.. అయినా ఆ రైతు వెనక్కి తగ్గలేదు. సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాడు. తక్కువ నీటితో సాగు చేసే బొప్పాయిని ఎంచుకొని మంచి లాభాలు సాధించాడు. బిందు సేద్యాన్ని అందిపుచ్చుకొని రెండెకరాల్లో రూ.2.10 లక్షల నికర ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామానికి చెందిన గాలే సాహెబ్ తనకున్న రెండెకరాల భూమిలో బొప్పాయి సాగు చేపట్టాడు. వాతావరణ మార్పులు, ఎల్నినో పరిస్థితులు, నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని బిందు సేద్యం పద్ధతిని ఎంచుకున్నాడు. మొక్కల మొదళ్ల వద్దకే నేరుగా నీరు అందేలా డ్రిప్ విధానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో నీటి వృథా తగ్గడంతో పాటు పంటకు అవసరమైన తేమను అందించగలిగాడు.

50 టన్నుల దిగుబడి.. రూ.2.10 లక్షల లాభం

రెండెకరాల్లో ఎకరాకు 25 టన్నుల చొప్పున మొత్తం 50 టన్నుల బొప్పాయి దిగుబడి సాధించాడు. పంట సాగుకు రూ.90 వేలు ఖర్చు చేయగా.. విక్రయాల ద్వారా రూ.3 లక్షల స్థూల ఆదాయం పొందాడు. పెట్టుబడి పోను రూ.2.10 లక్షల నికర లాభం వచ్చినట్లు వివరించాడు. నీటి కొరత ఉన్న సమయంలో బిందు సేద్యం ఎంతో ఉపయోగపడిందని గాలే సాహెబ్ తెలిపాడు. మొక్కలకు అవసరమైన నీటిని వేర్ల వద్దకే అందించడం వల్ల నీటి వినియోగం తగ్గిందని చెప్పాడు. ప్రభుత్వ సూక్ష్మ సేద్య పథకాలతో రైతులకు పెట్టుబడి భారం తగ్గుతోందని పేర్కొన్నాడు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు ఎంచుకోవాలని, నీటి లభ్యతను బట్టి ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. బిందు, తుంపర సేద్యంతో నీటిని పొదుపు చేసుకుంటూ పంటల వైవిధ్యీకరణ చేపడితే మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్లాస్టిక్ రహిత చండూరుగా తీర్చిదిద్దుదాం

మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, కమిషనర్ మల్లేశం

చండూరు, అక్టోబర్ 31(వుదయం):

పర్యావరణ పరిరక్షణ కోసం చండూరు మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్. మల్లేశం పిలుపునిచ్చారు. చండూరు పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం కిరాణా షాపుల అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించామని, వాటి స్థానంలో బట్ట, జూట్, పేపర్ బ్యాగులను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. అలాగే వ్యాపారులు ఎక్స్‌పైరీ డేట్ ముగిసిన సరుకులను విక్రయించవద్దని, షాపుల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, ఫుట్‌పాత్ ఆక్రమణలు చేయకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.ఈ పిలుపునకు స్పందించిన కిరాణా వ్యాపారులు ప్లాస్టిక్ నిర్మూలనకు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించడమే కాకుండా, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

సబ్ కలెక్టర్ సాక్షిగా...?

- పశువైద్య శాఖ నిర్లక్ష్యం బట్టబయలు!
- ఆసుపత్రుల్లో సిబ్బంది జాడేది? సమయపాలన ఏదీ?
- వైద్యం కోసం వస్తే వైద్యులే కనిపించరు.. రైతుల గోడు పట్టించుకునేదెవరు?
- కల్లూరు, చెన్నూరు పశువైద్య కేంద్రాల్లో విధుల పట్ల అలసత్వం.. మూగజీవాలకు అందని వైద్యం!

కల్లూరు అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

పశువులకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లోనే నిర్లక్ష్యం రాజ్యమేలుతోందా? రైతుల జీవనాధారమైన పశుసంపదకు సకాలంలో చికిత్స అందించాల్సిన బాధ్యతను కొందరు సిబ్బంది విస్మరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఆసుపత్రులు ఉన్నా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. విధులకు రావాల్సిన సమయాన్ని పట్టించుకోకపోవడం.. వైద్యం కోసం వచ్చే రైతులను గంటల తరబడి నిరీక్షణకు గురిచేయడం వంటి పరిణామాలు పశువైద్య శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సబ్ కలెక్టర్ పర్యటన సమయంలోనూ ఈ పరిస్థితులు వెలుగులోకి రావడం శాఖలో పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపుతోంది.

విధుల వేళల్లో సిబ్బంది ఎక్కడ?

కల్లూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఉదయం 10 గంటలు దాటినా వెటర్నరీ అసిస్టెంట్ విధులకు హాజరుకాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే తరహా పరిస్థితి చెన్నూరు పశువైద్య కేంద్రంలోనూ కనిపిస్తోందని, ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని పశుపోషకులు వాపోతున్నారు. విధులకు హాజరుకావాల్సిన సమయానికే సిబ్బంది కనిపించకపోతే పశువులకు వైద్యం అందించేది ఎవరు? రైతుల సమస్యలు వినేది ఎవరు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వైద్యం కోసం వస్తే.. ఎదురుచూపులేనా?

రైతులు అప్పులు చేసి, ఎంతో శ్రమించి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను పెంచుకుంటున్నారు. పశువులకు అనారోగ్యం వస్తే ప్రభుత్వ పశువైద్య కేంద్రాలనే ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో సకాలంలో చికిత్స అందకపోతే పశువుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులే జీవనాధారంగా ఉన్న రైతులకు ఈ పరిస్థితి ఆర్థికంగా కూడా భారంగా మారుతోంది.

సబ్ కలెక్టర్ పర్యటనలోనూ బయటపడిన పరిస్థితులు!

కల్లూరు డివిజన్ పరిధిలోని పశువైద్య కేంద్రాల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సబ్ కలెక్టర్ పర్యటన సందర్భంగా కూడా సిబ్బంది గైర్హాజరు, సమయపాలన లోపం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యటన సమయంలోనే పరిస్థితులు ఇలా ఉంటే సాధారణ రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తనిఖీలు నిర్వహించడం వరకే అధికారుల బాధ్యత ముగుస్తుందా? క్షేత్రస్థాయిలో మార్పు తీసుకొచ్చే చర్యలు ఎక్కడ? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మూగజీవాలకు వైద్యం అందకపోతే బాధ్యత ఎవరిది?

సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయని కొందరు పశుపోషకులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. పశువైద్య కేంద్రాల్లో హాజరు రిజిస్టర్లు, విధుల సమయాలు, వైద్య సేవల వివరాలను పరిశీలిస్తే నిర్లక్ష్యానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జీతాలు ప్రభుత్వానివి.. బాధ్యత ప్రజల పట్ల ఉండాలి!

ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధి నిర్వహణపై జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సిబ్బంది హాజరు తీరును పరిశీలించాలి. ప్రతి కేంద్రంలో నిర్ణీత సమయాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి. మూగజీవాలకు మాటలు రావు.. వాటి బాధను చెప్పుకునే అవకాశం లేదు. వాటి ప్రాణాలనే నమ్ముకుని జీవిస్తున్న రైతుల ఆవేదనను మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేయకూడదు! ఆసుపత్రి భవనాలు ఉండటం కాదు.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించడమే ముఖ్యం. కల్లూరు, చెన్నూరు పశువైద్య కేంద్రాల్లో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలి. బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు సకాలంలో పశువైద్య సేవలు అందించాలని పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరా గాంధీ 42 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

చర్ల, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరా గాంధీ 42వ వర్ధంతి వేడుకలను చర్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రధానిగా ఆమె తీసుకున్న కీలక నిర్ణయాలు భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. దేశ ఐక్యత, ప్రజల సంక్షేమం కోసం ఆమె చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఇందిరమ్మ కలలుగన్న సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు, ఆమె చూపిన నాయకత్వ పటిమ ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మడకం పద్మ, కాంగ్రెస్ నాయకులు గుండేపూడి భాస్కరరావు, పుగాకు సత్తిబాబు , నూపా కృష్ణ, చినిగిరి సుధాకర్, ముప్పిడి రమేష్, మేడి రమేష్, కారం సుధాకర్, ఎనూటి గిరిబాబు, భాస్కర్, స్వరూప్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్ నాయకురాళ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

అనంతగిరి అక్టోబర్ 31

భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఈరోజు అనంతగిరిలోని కొండపల్లి వాసు నివాసం వద్ద వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్ రెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముసుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సమగ్రత, సమైక్యత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు కొండపల్లి వాసు గారు, ఉపాధ్యక్షులు ధారావత్ కృష్ణ, సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు కనగాల వీరయ్య, మండల ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాగీ నరేష్,అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, వాయిల సింగారం సర్పంచ్ నందిగామ శ్రీనివాస్, కిష్టాపురం గ్రామ సర్పంచ్ కత్రం జ్ఞానేందర్ రెడ్డి, పాలారం గ్రామ శాఖ అధ్యక్షులు మట్టపల్లి రామకోటయ్య, పాలారం తండా గ్రామ శాఖ అధ్యక్షులు హాటీయా నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాకనాటి రాఘవరెడ్డి, ఖానాపురం మాజీ సర్పంచ్ గాదే వెంకన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్రబాబు, బోజియా నాయక్, మురళి, ఏపూరి ముత్యాలరావు, నాగేశ్వరరావు మరియు అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

ఐక్యతే దేశ ప్రగతికి పునాది.. రాష్ట్రీయ ఏక్తా దివస్ సందేశం

మునగాల పోలీస్ స్టేషన్‌లో కార్యక్రమాన్ని వీక్షించిన సీఐ ప్రతాప్ లింగం, ఎస్సై సంజీవరెడ్డి

మునగాల, అక్టోబర్ 31 (వుదయం):



భారతదేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను మునగాల పోలీసు అధికారులు విద్యార్థులు, సిబ్బందితో కలిసి వీక్షించారు. గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమాన్ని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని మునగాల మండల కేంద్రంలోని మునగాల పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రతాప్ లింగం, ఎస్సై సంజీవరెడ్డి పాల్గొని విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత అని, కులమత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ వేడుకలు చాటిచెప్పాయి. కార్యక్రమంలో విద్యార్థులు, మునగాల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత మాజీ ప్రధానికి ఘన నివాళి

ఢిల్లీ శక్తి స్థల్ లో ఇందిరా గాంధీకి నివాళులర్పించిన చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపి

చింతకాని సెప్టెంబర్ 31
(వుదయం ప్రతినిధి):

భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని శక్తి స్థల్ వద్ద చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి ఘన నివాళులర్పించారు. భారత దేశాన్ని విదేశీ శత్రువుల నుండి, అంతర్గత వేర్పాటు వాదుల నుండి కాపాడడంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారని, ప్రపంచ దేశాలకు నాయకత్వం వహించిన వీరవనితగా చరిత్రలో నిలిచారని ఆయన కొనియాడారు. వేర్పాటువాదుల చేతిలో ఆమె ప్రాణాలు కోల్పోయినా, నేటికీ భారత జాతి గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న బలమైన నాయకురాలు ఇందిరా గాంధీ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంల మండల కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య పాల్గొన్నారు.

ఖాకీ యూనిఫాం వెనుక సేవా హృదయం

గిరిజన చిన్నారులకు అండగా కమ్యూనిటీ కనెక్ట్!

చర్ల, అక్టోబర్ 3, 1(వుదయం ప్రతినిధి)

ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలకు అండగా నిలుస్తూ, చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా పోలీస్ శాఖ చేపట్టిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల మండల పరిధిలోని చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలకు చెందిన 100 మంది చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల సంక్షేమం, అభివృద్ధికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, ప్రజలకు ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చిన్నారుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, వారికి నాణ్యమైన విద్య అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా, సామాజిక బాధ్యతతో పేద, గిరిజన కుటుంబాలకు చేయూతనివ్వడం కూడా పోలీస్ శాఖ లక్ష్యమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

చండూరు హైస్కూల్‌లో సదస్సు

చండూరు, అక్టోబర్ 31 (వుదయం):

విద్యార్థి స్థాయిలోనే ప్రభుత్వ చట్టాలపై అవగాహన పెంచుకుని, సమాజంలో ఆదర్శవంతంగా నడుచుకోవాలని మండల లీగల్ అడ్వైజర్ నారపాక ఆంజనేయులు, ఏఎస్ఐ ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు పిల్లలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక పోక్సో (POCSO) చట్టం, మాదకద్రవ్యాల నిర్మూలన, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు అందుబాటులో ఉండేందుకు డయల్ 100 సంఖ్య '112'గా మారిందని స్పష్టం చేశారు.

పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం ఎస్. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దోజు సుధీర్ బాబు, కురుపాటి సతీష్, ఏ. రాజు, కే. వెంకట్ రెడ్డి, జి. సుమ, ఎం. సంతోష, వై. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీకి భారీ స్పందన

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్గొండ జిల్లా అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో చేపట్టిన ఛలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా భారీ స్పందన లభిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ ఉద్యమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలను సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపునకు వినియోగిస్తోందని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

మరో సత్యాగ్రహ పోరాటం

దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ సత్యాగ్రహ మార్గంలో పోరాడిన స్ఫూర్తితోనే నేడు రాహుల్‌గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ పోరాటం కాదని, దేశ భవిష్యత్తును, పౌరుల హక్కులను కాపాడే ప్రతి ఒక్కరి ఉద్యమమని అన్నారు.

ప్రజల స్పందన చూసి కేంద్రం భయపడుతోంది

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే నిరసనకు రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు. ఈ ఉద్యమానికి వస్తున్న స్పందనను చూసి కేంద్ర ప్రభుత్వం నిరసనకారుల ప్రయాణానికి ఆటంకాలు కల్పిస్తోందని, నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు. అధికారాన్ని ఉపయోగించి రైళ్లను నిలిపివేయవచ్చేమో కానీ ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షలను ఆపలేరని అన్నారు. ఎన్ని అడ్డంకులు, నిర్బంధాలు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత నెలకొని, ఓటర్ల హక్కులకు రక్షణ కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

భద్రాచలం టీఎస్ యూఎఫ్‌వై మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పి.ఎస్.వి. ప్రసాద్‌బాబు ఎన్నిక

భద్రాచలం,31/10/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం మండల TS UTF 13వ మహాసభ శుక్రవారం మండల అధ్యక్షులు కొమరం శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో సంఘం బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం భద్రాచలం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పి.ఎస్.వి. ప్రసాద్‌బాబు ఎన్నికయ్యారు. నూతన మండల కమిటీ వివరాలు: అధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు (PMSHRI SNM ZPHS, కొర్రాజులగుట్ట), ప్రధాన కార్యదర్శిగా పి.ఎస్.వి. ప్రసాద్‌బాబు (GHS, భద్రాచలం), ఉపాధ్యక్షులుగా కె.ఎం. కరుణకుమార్ (MPPS, ఎస్.ఆర్. నగర్), కె. పుష్పలత (ZPHS, జి. భద్రాచలం), కోశాధికారిగా ఎస్. ఆశాలత (MPUPS, జగదీష్‌కాలనీ) ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా ఎన్నికైనవారు: పి. సారయ్య (TMRS), బి. జనార్ధన్ (AGHS బాయ్స్), కె. నాగలక్ష్మి (KGBV), డి. అపర్ణ (MJPT), టి. పూజిత (MPP SNM, కొర్రాజులగుట్ట), మమత (ZPHS, భద్రాచలం) ఎన్నికయ్యారు. వివిధ విభాగాల కన్వీనర్ల నియామకం: మహిళా విభాగం కన్వీనర్‌గా టి. సునీత (MJPT), మండల ఆడిట్ కన్వీనర్‌గా టి. వెంకట్‌రామ్, FWF కన్వీనర్‌గా కె. సైదులు (MPUPS, జగదీష్ కాలనీ), VOTT కన్వీనర్‌గా కె. పాపయ్య (MPPS, తాతగుడి సెంటర్), సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా పి. భారతి (PMSHRI SNM ZPHS, కొర్రాజులగుట్ట), క్రీడా కన్వీనర్‌గా ఎం. రమేష్ (GHS, భద్రాచలం) ఎన్నికయ్యారు. ఈ మహాసభకు జిల్లా అధ్యక్షులు మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్‌కుమార్ నూతన కమిటీ ఎన్నికల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకులు పి. లక్ష్మీనారాయణ, రాజశ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాల బాధ్యులు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మురళీ మోహన్ మాట్లాడుతూ, గత ఏడాది కాలంగా భద్రాచలం మండల శాఖ చక్కగా పనిచేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సంఘం సాధించిన పురోగతిని కొనసాగిస్తూ, మరింత ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయుల గొంతుకగా నిలవాలని సూచించారు. అదేవిధంగా నవంబర్ 14న భద్రాచలంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభలను కూడా విజయవంతం చేసేందుకు నూతన మండల కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మహాసభలు ఉపాధ్యాయుల సమస్యలను చర్చించడానికి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించడానికి కీలక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. భద్రాచలం మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం పట్ల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

అనంతగిరి అక్టోబర్ 31
వుదయం

మండల పరిధిలోని వెంకటరామపురం గ్రామ నాలుగో వార్డులో సివిల్ రైట్స్ యాక్ట్ సందర్భంగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లి కొండ జయరాజు, డిప్యూటీ తహశీల్దార్, అనంతగిరి ఏఎస్ఐ జానీ పాల్గొని వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కుల, మత, వర్గ వివక్షకు తావులేకుండా సమానత్వం, సామాజిక న్యాయం పాటించాలని తెలిపారు. పౌర హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్టాలపై అవగాహనతోనే సమాజంలో సమానత్వం, సామరస్యం సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

అనంతగిరి అక్టోబర్ 31 వుదయం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం కోదాడ నియోజకవర్గం లోని అనంతగిరి మండలం బొజ్జగూడెం తండ గ్రామం లంబాడీ బాపు స్టేజి దగ్గర ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1920లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ ఈ దేశానికి పూర్తి స్వాతంత్య్రం కావాలని పోరాటం చేసిన మొట్టమొదటి యూనియన్ అని ఆయన గుర్తు చేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26,000/- గా నిర్ణయించి అమలు చేయాలని. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని పిఎఫ్ ఈఎస్ఐ, గ్రాట్యుటీ పై ఉన్న సీలింగ్ ను ఎత్తివేసి కనీస పెన్షన్ రూ. 10,000/-లు ఇవ్వాలని ఎస్ పి ఎం లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని సింగరేణికి నూతన బొగ్గు బావులు కేటాయించాలని ఆటో హమాలీ వంటి అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఆశ వర్కర్లకు కనీస వేతనం 26000/-ఇవ్వాలి, ఈఎస్ఐ ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు . ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ హమాలీ కార్యదర్శి పోతురాజు సత్య నారాయణ,భూక్యా కోటేశ్వరరావు,బానోతు నాగులు, పొలంపల్లి రాఘవులు,సైదా, డ్రైవర్స్ సైదా, నాగేశ్వరావు, గోపి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడుతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

రెండు నాటు తుపాకులు, ఇతర సామగ్రి స్వాధీనం

దమ్మపేట అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చెన్నపురిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడేందుకు వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, కారం నాగేంద్రబాబు (34), కారం చిట్టిబాబు (27), మొడియం సురేంద్రబాబు (25) అనే ముగ్గురు వ్యక్తులు గత కొంతకాలంగా తమ వద్ద ఉన్న నాటు తుపాకులతో సమీప అటవీ ప్రాంతాల్లో అడవి జంతువులను వేటాడుతున్నారు. వారి వద్ద నుండి పోలీసు అధికారులు రెండు నాటు తుపాకులు, సుమారు 100 గ్రాముల గన్ పౌడర్, 37 చిన్న ఇనుప గుండ్లు ఇతర మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పెనుబల్లి శ్రీను దమ్మపేట పోలీసు స్టేషన్ నందు ఒక కేసులో అరెస్టు కాబడి ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. అడవి జంతువులను వేటాడటం, వాటి మాంసాన్ని అక్రమంగా విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు పోలీసు మరియు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో అశ్వారావుపేట సిఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మర్స్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

మధిర, అక్టోబర్, 31, వుదయం, ప్రతినిధి:

భారతదేశ ఐక్యతకు విశేష కృషి చేసిన ఉక్కుమనిషి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపూర్యుడు లింగయ్య, ఆలపాటి అప్పారావు, ఆదారి అభ్రహం మాట్లాడుతూ 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నడియాడ్‌లో జన్మించిన వల్లభాయ్ పటేల్ లండన్‌లో బారిస్టర్ విద్యను అభ్యసించి స్వదేశానికి తిరిగి వచ్చి స్వాతంత్య్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. 1918లో ఖేడా సత్యాగ్రహం, 1928లో బార్డోలీ సత్యాగ్రహం ద్వారా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారని, బార్డోలీ సత్యాగ్రహ విజయానంతరం మహిళలు ఆయనకు సర్దార్ అనే బిరుదును ప్రదానం చేశారని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యతకు పటిష్టమైన పునాది వేసిన మహనీయుడిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జయంతిని ఏటా అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని, గుజరాత్‌లో నిర్మించిన 182 మీటర్ల ఎత్తైన ఐక్యతా విగ్రహం ఆయనకు దేశం అందిస్తున్న గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లపోతుల ప్రసాద్, ఇన్‌స్టైల్ రాము, మునగాల తిరుపతిరెడ్డి, షేక్ జానీ, యరమల కోటిరెడ్డి, శాఖమూడి బ్రహ్మయ్య, మేకల ఉపేంద్ర, వేమిరెడ్డి పిచ్చిరెడ్డి, దాచేపల్లి రాము, నీరుకొండ మురళి, వాసంశెట్టి జనార్ధన్, వట్టే సైదులు,చలువాది వరుణ్, లింగాల శ్రీనివాస్, ఆర్.కె. ఇన్‌స్టైల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక ఆదాయం - ఆదర్శంగా తుంగతుర్తి రైతు

సూర్యాపేట అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

నీటి ఎద్దడి... వాతావరణ మార్పులు... అనిశ్చిత వర్షాలు... ఇవేవీ ఆ రైతును వెనక్కి తగ్గించలేకపోయాయి. సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆలోచించి బీర సాగుతో మంచి లాభాలు సాధిస్తున్నాడు. ఆధునిక సాగు పద్ధతులను అందిపుచ్చుకుని తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రావులపల్లి ఎక్స్ రోడ్డుకు చెందిన గుగులోత్ భాస్కర్. భాస్కర్ తనకున్న 1.50 ఎకరాల్లో బీర పంట సాగు చేస్తున్నాడు. నీటి వృధాను అరికట్టేందుకు డ్రిప్ ఇరిగేషన్, నేలలో తేమను కాపాడేందుకు మల్చింగ్, తీగల పెరుగుదలకు ట్రెల్లిస్ విధానాన్ని అమలు చేస్తున్నాడు. ఈ పద్ధతులతో తక్కువ నీటితోనే పంటను సమర్థవంతంగా సాగు చేస్తున్నాడు. ఫలితంగా సాగు ఖర్చు తగ్గడంతో పాటు పంట నిర్వహణ, కాయల కోత కూడా సులభంగా మారింది. ఆధునిక పద్ధతుల్లో సాగు చేసిన భాస్కర్ ఇప్పటివరకు 20 టన్నుల బీర దిగుబడి సాధించాడు. పంట విక్రయాల ద్వారా రూ.4 లక్షల ఆదాయం పొందగా, సాగుకు రూ.1.60 లక్షలు ఖర్చయ్యాయి. అన్ని ఖర్చులు పోను ఇప్పటివరకు రూ.2.40 లక్షల నికర లాభం వచ్చినట్లు తెలిపాడు. పంట సాగుతోనే సరిపెట్టుకోకుండా మార్కెటింగ్ లోనూ భాస్కర్ ప్రత్యేకత చాటుతున్నాడు. బీర కాయలను తన సొంత వాహనంలో వరంగల్ మార్కెట్ కు తీసుకెళ్లి విక్రయిస్తున్నాడు. దీంతో మధ్యవర్తుల పై ఆధారపడకుండా పంటకు తగిన ధర పొందడంతో పాటు రవాణా ఖర్చులను కూడా తగ్గించుకుంటున్నాడు. వరి సాగుతో పోలిస్తే కూరగాయల సాగు ద్వారా తరచూ ఆదాయం పొందే అవకాశం ఉంటుందని భాస్కర్ చెబుతున్నారు. డ్రిప్, మల్చింగ్, ట్రెల్లిస్ పద్ధతులను పాటిస్తే నీటి కొరత ఉన్న పరిస్థితుల్లోనూ మంచి ఫలితాలు సాధించవచ్చని అంటున్నాడు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని సూర్యాపేట జిల్లా ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. బిందు సేద్యం, మల్చింగ్ వంటి ఆధునిక పద్ధతులతో సాగు ఖర్చులు తగ్గించుకుని, స్థిరమైన ఆదాయం పొందవచ్చని చెబుతున్నారు.

చిన్నమండవలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

చింతకాని, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

మండల పరిధిలోని చిన్నమండవ గ్రామ పంచాయతీలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా జరిగింది. తహసీల్దార్ కరుణశ్రీ, ఎస్సై జి.నరేష్ ముఖ్య అతిథులుగా హాజరై రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగమే ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛకు పునాది అని, హక్కుల ఉల్లంఘన జరిగితే చట్టపరంగా న్యాయం పొందవచ్చని సూచించారు. సర్పంచ్ పర్సా రామచంద్రరావు, ఆర్ఐ ఏకవీర, అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

- నవంబర్ 5 నుంచి గ్రామగ్రామాన ప్రచార కార్యక్రమాలు
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి

మునగాల, అక్టోబర్ 31 (వుదయం):

అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేసేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన జిల్లా విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో నల్గొండలో రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రకు నిలయమైన సూర్యాపేట జిల్లా నుంచి ఈ మహాసభల విజయవంతానికి ప్రత్యేక కృషి జరగాలని ఆమె ఆకాంక్షించారు. ఇందులో భాగంగా నవంబర్ 5వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా డప్పు దళాలు, కోలాట బృందాలు, కళాకారులతో గ్రామగ్రామాన ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వాడవాడలా, పల్లెపల్లెనా రైతు సంఘం మహాసభల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు.

జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కనీసం ఐదు వేల రైతు కుటుంబాలను నేరుగా కలిసి మహాసభల లక్ష్యాలు, రైతాంగ సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల హక్కులు, వ్యవసాయ రంగ సమస్యలు, రైతాంగ ఐక్యతను బలోపేతం చేసే దిశగా ఈ జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలవనున్నాయని ఆమె పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రజలను సమీకరించి మహాసభలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జూలకంటి విజయలక్ష్మి కోరారు.

28 ఏళ్ల సుదీర్ఘ సేవలకు వీడ్కోలు

నిబద్ధత, క్రమశిక్షణతో సహకార బ్యాంకు అభివృద్ధికి విశేష సేవలందించిన ఉప్పల రవీందర్ కుమార్

నల్గొండ జిల్లా
అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో ఉద్యోగ జీవితంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి అంకితభావంతో సేవలందించడం ప్రతి ఉద్యోగికి గర్వకారణం. ఈ క్రమంలో నల్గొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్‌లో 28 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించి, మేనేజర్ హోదాలో ఉప్పల రవీందర్ కుమార్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగిన ఆయన ఉద్యోగ ప్రస్థానంలో ఎన్నో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ సహచర ఉద్యోగులు, అధికారుల మన్ననలు పొందారు. బ్యాంకు కార్యకలాపాల నిర్వహణలో తన అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో తనదైన ముద్ర వేశారు. వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవంతో సంస్థాగత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, సహోద్యోగులతో సత్సంబంధాలను కొనసాగించారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను అధిగమిస్తూ 28 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం విశేషం. ఉద్యోగ విరమణ అనేది బాధ్యతల నుంచి విశ్రాంతి మాత్రమేనని, ఇన్నాళ్లుగా సంపాదించిన అనుభవాలు, జ్ఞాపకాలు జీవితాంతం తోడుంటాయని సహచరులు పేర్కొంటున్నారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ భవిష్యత్తులో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షిస్తున్నారు. 28 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానానికి ముగింపు పలుకుతున్న ఉప్పల రవీందర్ కుమార్‌కు సహచర ఉద్యోగులు, మిత్రులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనమైన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సీఈఓ శంకర్రావు జనరల్ మేనేజర్ నర్మదా కురువ నాయక్ కుటుంబ సభ్యులు భార్య నాగలక్ష్మి కుమారులు వెంకట సాయి శ్రీయాష్ కుమార్తెలు అక్షిత, అసిరా అవంతి బంధుమిత్రులు స్నేహితులు కార్యవర్గ సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలి

జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్

ఖమ్మం, వుదయం బ్యూరోఅక్టోబర్ -31

రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ ఆదేశాల ప్రకారం, జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, విక్రయ కేంద్రాలు బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యానికి కిలోకు గరిష్ట చిల్లర ధరలు బిపిటి (BPT) / కెఎన్ఎం (KNM) కిలో రూ. 66/-, ఆర్ఎన్ఆర్ (RNR) / తెలంగాణ సోనా కిలో రూ. 74/-, హెచ్ఎంటీ (HMT) / జెఎస్ఆర్ (JSR) కిలో రూ. 79/-గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరల వివరాలతో కూడిన ప్రభుత్వ బ్యానర్ ను రైస్ మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు, విక్రయ కేంద్రాల వద్ద వినియోగదారులకు కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ (పౌర సరఫరాలు) ఆదేశాల మేరకు, జిల్లా పౌర సరఫరాల అధికారి పట్టణంలోని బియ్యం విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యాన్ని విక్రయించాలని, ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విక్రయదారులను హెచ్చరించారు. ధరల పట్టిక ప్రదర్శనలో లేదా నిర్ణయించిన ధరల అమలులో ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు ఎవరైనా నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే, ఆ విషయాన్ని వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం, ఖమ్మం దృష్టికి తీసుకురావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నరు.

పశువుల అక్రమ తరలింపు వాహనం బోల్తా

ఎనిమిది పశువులు గోశాలకు తరలింపు.. డ్రైవర్‌కు గాయాలు

చండూరు ,అక్టోబర్ 31 (వుదయం):

మండల పరిధిలోని ఉడుతలపల్లి గ్రామ శివారులో శనివారం తెల్లవారు జామున పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు చిన్న వాహనంలో (ఏపీ 39 వీబీ 1823) నాలుగు ఆవులు, నాలుగు ఎడ్లను ఇరుకుగా కుక్కి తరలిస్తున్నారు. అతివేగం కారణంగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పల్లా సూరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. బీట్ కానిస్టేబుల్ కోమరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చండూరు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న పశువులను కాపాడి సంరక్షణ నిమిత్తం బంగారిగడ్డలోని యుగ తులసి గోశాలకు తరలించారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం: నల్గొండ అంజి
- మునుగోడులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమం

మునుగోడు,అక్టోబర్ 31 (వుదయం):

అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు నల్గొండ అంజి పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నల్గొండ అంజి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఓటరు నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టభద్రులు తమ అవసరమైన పత్రాలను హెల్ప్‌లైన్ నంబర్ 9032891257 కు పంపిస్తే ఉచితంగా నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మగాని లింగయ్య, యడవెల్లి సురేష్, భీమనపల్లి కిరణ్, పందుల సురేష్, బండారు శ్రీనివాస్, శశి, అశోక్, విజయ్ కాంత్, రాఖీ, సాయి, విగ్నేష్, కిరణ్ పాల్గొన్నారు.

ఉత్తమ రైతు విద్యాసాగర్‌రెడ్డి మృతి రైతు లోకానికి తీరని లోటు

అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్గొండ జిల్లా
అక్టోబర్ 31 వుదయం వార్త ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో ఉత్తమ రైతు చిలక విద్యాసాగర్‌రెడ్డి మృతి రైతు లోకానికి తీరని లోటని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లతో కలిసి శనివారం నల్లగొండ దేవరకొండ రోడ్డులోని విద్యాసాగర్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఆయన అంతిమయాత్రలో పాల్గొని పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాసాగర్‌రెడ్డి ఆదర్శ రైతుగా నిలిచి ఎంతోమందికి స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యానవన పంటల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించి ఉత్తమ రైతుగా అవార్డు పొందారని గుర్తుచేశారు. వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, కోట్ల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు సీఏం,డీసీఏంల పనితీరుపై విరుచుకుపడ్డారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కులు

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 31

సొంత రాష్ట్రాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా పక్కనున్న ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల గురించే పని చేస్తున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు.సూపర్ ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన కరువు వస్తుందని తెలిసి కూడా కృష్ణా, గోదావరి జలాలను ఒడిసిపట్టకుండా కిందికి వదిలేయడం బాధాకరమన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండల కేంద్రంలో పార్టీ సమావేశం జరిగింది.జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర,ఎమ్మెల్సీ,పార్టీ ఖమ్మం జిల్లా ఇంఛార్జి తక్కళ్లపల్లి రవీందర్ రావు,మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనిపించడం లేదని,నీళ్లు, కరెంట్ అక్కడ "ఫుల్"గా ఉంటే, తెలంగాణ "నిల్"గా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ముగ్గురు మంత్రులు తమ స్వప్రయోజనాల గురించే పని చేస్తున్నారు తప్ప, జిల్లా అభివృద్ధి,ప్రజల సంక్షేమం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని,గతం ప్రభుత్వం చేపట్టిన పనులకు రిబ్బన్లు కట్ చేస్తూపోతున్నారని ఎంపీ రవిచంద్ర విమర్శించారు.రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయని,సాగు,తాగు నీళ్లు లేవు, కరెంట్ లేదు,వేసిన పంటలు ఎండిపోతున్నయ్,పింఛన్లు పెంచలే,ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మీ రావట్లే,కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు ఇవ్వలే, సంక్షేమం మాటే లేదు, అభివృద్ధి పనుల జాడే కనిపించట్లేదని ఎంపీ వద్దిరాజు కాంగ్రెస్ పాలనను నిశితంగా దుయ్యబట్టారు.మధిర నియోజకవర్గంలో నామ నాగేశ్వరరావు, కమల్ రాజ్ లు పార్టీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ పట్టభద్రుల ఓట్ల నమోదు బాగా చేయిస్తున్నారన్నారు.దీనిని మరింత ముమ్మరం చేయాల్సిందిగా,ఇల్లిల్లు తిరిగి అన్ని వర్గాలను స్వయంగా కలవాల్సిందిగా గులాబీ శ్రేణులను ఎంపీ రవిచంద్ర కోరారు.రాకేష్ రెడ్డి గెలుపుతో కమల్ రాజ్ ఘన విజయం సాధించడం, భట్టిని ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు."కాంగ్రెస్ పోవాలి-బీఆర్ఎస్ రావాలి, రేవంత్ రెడ్డి పోవాలి-కేసీఆర్ రావాలి"అనే నినాదాలు ఊరావాడ బలంగా వినిపిస్తున్నాయని.. బీఆర్ఎస్ కు ఘన విజయం చేకూర్చి కాంగ్రెస్ పార్టీని బండకేసి కొట్టడానికి ప్రజలు సంసిద్ధులై ఉన్నారని,వచ్చే ఎన్నికల తర్వాత కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు - కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ హెచ్చరిక

ఖమ్మం వుదయం బ్యూరోఅక్టోబర్ 31

జిల్లాలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బి.ఆర్.ఎస్. పార్టీ మీడియా సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పార్లమెంట్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, జిల్లా నాయకులు గుండాల (ఆర్జేసి) కృష్ణ, ఉప్పల వెంకటరమణ పాల్గొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విద్యావంతులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో అక్కడ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పినట్లే, తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలు ఈ ఎన్నికల ద్వారా తగిన షాక్ ట్రీట్మెంట్ ఇస్తారని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో అద్భుతంగా సాగిన సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కృత్రిమ కరువు సృష్టించబడిందని మండిపడ్డారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ..

– "ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మూడు ఉమ్మడి జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎన్‌రోల్‌మెంట్ బ్రహ్మాండంగా సాగుతోందని తెలిపారు.

– ఖమ్మం జిల్లాలో లక్షకు పైగా ఓట్లు నమోదయ్యాయని, పార్టీ క్యాడర్ గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు వేసుకుని శ్రమిస్తున్నారన్నారు.

– కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనలో సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణను కరువు కోరల్లోకి నెట్టారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, మేడిగడ్డను నిర్లక్ష్యం చేయడం వల్ల ఇవాళ రైతులు నీళ్ళు లేక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కూతురు కవితపై, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు".

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ..

– "తెలంగాణలో డైవర్షన్ రాజకీయాలు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు.

– మూడేళ్ల నుంచి కేవలం సమస్యలను సృష్టించి కాలం వెళ్లదీస్తున్నారని, హైదరాబాద్ భూముల అమ్మకాలు తప్ప ప్రజా సంక్షేమం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

– ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది సమ్మె చేస్తున్నా పట్టించుకోని నిర్లక్ష్య వైఖరి కాంగ్రెస్‌ది అని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని అందించిన ఘనతను ప్రస్తుత ప్రభుత్వం వృథా చేస్తోందన్నారు".

ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ..

– "కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన యువత, ఉద్యోగులు, ప్రజలు మోసపోయామని ఈరోజు మథనపడుతున్నారని తెలిపారు.

– గతంలో కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసిన వారే ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఆ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

– జిల్లాలో ముగ్గురు మంత్రుల అరాచకాలకు ప్రజలు విసిగిపోయారని, రామారావు హత్య కేసులో నిజమైన దోషులను వదిలేసి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న పోలీసు యంత్రాంగాన్ని హెచ్చరించారు. తక్షణమే ఈ ఘటనపై 'సిట్' విచారణ జరపాలని డిమాండ్ చేశారు".

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..

– "గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, విద్యావంతులైన ఓటర్లందరూ తమ ఓటు హక్కును సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

– కర్ణాటకలో కాంగ్రెస్ మోసాలను గ్రహించి అక్కడి గ్రాడ్యుయేట్లు ఎన్నికల్లో ఆ పార్టీని ఎలా ఓడించారో, తెలంగాణలోనూ అదే పునరావృతం కాబోతుందన్నారు.

– ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు". కార్యక్రమంలో ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, మరియు నాయకులు కోటి సైదిరెడ్డి, బలుసు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజాపూర్‌లో కుంభం అండాలు చిత్రపటానికి నివాళి

తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్గొండ జిల్లా అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీలో ఉన్న వీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన శ్రీమతి కుంభం అండాలు ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అండాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండాలు మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

భూ రీసర్వే పనులు, రెవెన్యూ శాఖలో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, బ్రహ్మోస్ పరిశ్రమ, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వెబెక్స్ ద్వారా మండల తహసీల్దార్లు తో నిర్వహించిన సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ముందుగా రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించి, సంబంధిత నివేదికలను ఆర్డీఓలకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. డేటా కరెక్షన్, భూదాన్, భూభారతి తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లను పరిష్కరించడంతో పాటు నివేదికలు, భౌతిక ఫైళ్లను కూడా పంపించాలని సూచించారు. ముఖ్యంగా బాలానగర్, నవాబుపేట, దేవరకద్ర, మిడ్జిల్, చిన్నచింతకుంట మండలాల్లో పెండింగ్ ఫైళ్లు అధికంగా ఉన్నాయని, వాటిని ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వివిధ మండలాల్లోని గ్రామాల్లో చేపడుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్‌లో రీసర్వే పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. హన్వాడ మండలంలోని తులసముద్రం, యారోనిపల్లిలో రోవర్ సమస్యల కారణంగా సర్వే పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత సాంకేతిక నిపుణులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. వచ్చే వారంలోగా ప్రతి మండలంలో రెండు సర్వే బృందాలతో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.

కోయిలకొండ, అడ్డాకుల, మూసాపేట, మహమ్మదాబాద్, చిన్నచింతకుంట, బాలానగర్, భూత్పూర్, రాజాపూర్ మండలాల్లో రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



అనంతరం భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. భూత్పూర్, చిన్నచింతకుంట, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల్లో జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. టీజీఐఐసీ అధికారులతో సమన్వయం చేసుకుని అమరరాజా పారిశ్రామికవాడకు సంబంధించిన భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణకు పై సమీక్షిస్తూ సర్వే పూర్తయిన భూములకు వెంటనే అవార్డులు పాస్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై సమీక్షించారు. అజిలాపూర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సర్వే పనుల పురోగతిని కూడా అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులు దాదాపు పూర్తయినందున, వెంటనే నివేదికలు సమర్పించాలని సర్వే అధికారులను ఆదేశించారు.

అనంతరం హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఓటరు నమోదుకు సంబంధించి అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ. యాదగిరి, భూమి రికార్డులు, సర్వే విభాగం ఏడీ అశోక్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అనుప్రియ, క్రిస్టినా, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారు అనూష సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 31 :

పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారు అనూష సతీష్ అన్నారు. జిల్లా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 6.0 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది కేవలం పరిసరాల పరిశుభ్రతకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మారాలన్నారు. చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, ఇల్లు, పరిసరాలు, బహిరంగ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వరుసగా ఆరో విడత స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యానగర్ వార్డు కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యవారిపల్లిలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాల మెగా డ్రైవ్ ముగింపు కార్యక్రమం

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (NALSA)మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, మహబూబ్ నగర్ ప్రేమలత గారి ఆదేశాల మేరకు నిర్వహించిన మెగా డ్రైవ్ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా DLSA సెక్రటరీ డి ఇందిరా గారు గ్రామప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మెగా డ్రైవ్ ద్వారా సాధించిన ప్రగతి ని వివరించారు. గ్రామ ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయం, మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు మరియు అర్హులైన పేద ప్రజల హక్కుల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరియు అర్హులైన వారికి లేబర్ కార్డు లు అందించారు. DWO మహబూబ్ నగర్ ద్వారా దివ్యాంగురాలికి వీల్ చైర్ అందించడం జరిగింది.

ఈ సందర్భంగా మెగా డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు (PLVs) ప్రజలకు అందించిన సేవలకు గాను వారికి అప్రిసియేషన్ సర్టిఫికెట్ మరియు మెమంటో ల తో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీమతి జరీనా బేగం గారు, MPDO కోయిల్కొండ ధనుంజయ్ గౌడ్ గారు, MRO కోయిల్కొండ శ్రీ దీపక్ రావు గారు, SI కోయిల్కొండ శ్రీ నాగరాజు గారు, అసిస్టెంట్ రీజినల్ లేబర్ ఆఫీసర్ శ్రీ మహేందర్ గారు, గ్రామ సర్పంచ్ శ్రీ వాగ్య నాయక్ గారు, ఉపసర్పంచ్ శ్రీ శ్రీనివాస్ గారు, పంచాయతీ కార్యదర్శి కోయిల్కొండ శ్రీ గోపాల్ సింగ్ గారు, శ్రీ మోహన్ రెడ్డి గారు ఫార్మర్ (EX డిప్యూటీ సర్పంచ్), శ్రీ G చంద్ర శేఖర్ గారు PLV బ్రహ్మ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు, LADCS సిబ్బంది, PLV లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సౌకర్య ఆధారిత సమీక్ష

మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి , మహబూబ్నగర్ అక్టోబర్ నెల శిశు మరణాలపై డి ఎమ్ హెచ్ ఓ డా.శ్రీనివాసులు సౌకర్య ఆధారిత సమీక్ష శనివారం నిర్వహించారు. ఈ సమీక్షలో SNCUలోని మరణాలు, నెలలు నిండకుండా పుట్టడం, పుట్టుకతో వచ్చే ఊపిరాడకపోవడం, శ్వాసకోశ ఇబ్బందులు వంటి వివిధ మరణ కారణాలను సమీక్షించడం జరిగింది. అలాగే SNCUను సందర్శించి, మానవ వనరులు (HR) మరియు పరికరాల వివరాల గురించి ఆరా తీయడం, మరియు GGHలో రోగులకు సరఫరా చేస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డిఎమ్‌హెచ్ఓ డా శ్రీనివాసులు తో పాటు, డి ఐ ఓ డా. శైలజ, జిల్లా టీ బి నియంత్రణ అధికారి మల్లికార్జున్ గారు, పీడియాట్రిక్ హెచ్ఓడి డా. అజయ్ మోహన్ గారు, ఎస్ఎన్‌సియు పీడియాట్రిషియన్ డా. విజయ్ కుమార్ గారు, గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. షహనాజ్ ,డా.పులి విద్య పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ – ఓట్ చోరీ కార్యక్రమానికి కార్యకర్తలతో బయలుదేరిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):-

ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఛలో ఢిల్లీ – ఓట్ చోరీ కార్యక్రమంలో పాల్గొనేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తమ పార్టీ కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను సాధించడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వారు పాల్గొననున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఓటుకు విలువ ఉండాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్, డిసిసి ఉపాధ్యక్షులు, పంపరి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, జమీల్, సాయిబాబు, కామారెడ్డి నియోజకవర్గ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ యూత్ అధ్యక్షులు నర్సిల్ల మహేష్, రాహుల్ బయలుదేరారు.

ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్’ ను ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేసి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సంసిద్ధులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన ‘ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్’ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేవలం విద్యాపరమైన మార్కులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందులో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో యంగ్ ఒరేటర్స్ క్లబ్ , థింక్ అండ్ మేక్ , స్వతః, ఫ్యూచర్ డాట్స్ వంటి నాలుగు ప్రధాన రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. యంగ్ ఒరేటర్స్ క్లబ్ (Young Orators Club) కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల, మౌఖిక సంభాషణా నైపుణ్యాలు, వేదికపై ధైర్యంగా ప్రసంగించడం, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందిస్తారు. ఈ కార్యక్రమానికి కీర్తన వేపా ప్రతినిధిగా వ్యవహరిస్తారు. థింక్ అండ్ మేక్ (Think and Make) కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా విధానం, విమర్శనాత్మక ఆలోచన మరియు సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే సామర్థ్యాలను అభివృద్ధి చేస్తారు. ఈ కార్యక్రమానికి నాగేష్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. స్వతః (Svatah) కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, డబ్బు నిర్వహణ మరియు ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమానికి సంతోష్ దిన్నె మరియు యువరాజ్ సక్కూర్ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ఫ్యూచర్ డాట్స్ (Future Dots) కార్యక్రమం ద్వారా 9, 10వ తరగతుల విద్యార్థులకు వివిధ వృత్తులు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య మరియు భవిష్యత్ కెరీర్ ప్రణాళికపై మార్గదర్శకత్వం అందిస్తారు. ఈ కార్యక్రమానికి పవన్ కుమార్ కొల్లి, నిఖిల్ దాసరి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, సామాజిక మరియు ఉద్యోగ రంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం విద్యాపరమైన మార్కులు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తుకు సరిపోవని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి జీవిత నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో స్థిరమైన ఉపాధి అవకాశాలను పొందాలంటే ఆధునిక ఉద్యోగ రంగ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందించడం ప్రస్తుత కాలపు అత్యవసర అవసరమని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, డి.ఎస్.ఓ షంషీర్, జి.సి.డి.ఓ అస్రా ఖాద్రి, ఎం.ఈ.ఓ ఉషారాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కె.జి.బి.వి ల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలి

- నల్లగొండ జిల్లా, డివిజన్, మండల కమిటీల ఏర్పాటుపై చర్చ
- రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి సైదులు, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చింత ఎల్లయ్య

నల్గొండ జిల్లా అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో జిల్లాలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కమిటీల ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఉద్యమాల పులిబిడ్డ కృష్ణ మాదిగ జిల్లా కమిటీల నిర్మాణం, వాటి బాధ్యతలు, సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే విధానంపై నాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి సైదులు కమిటీల ఏర్పాటు ప్రక్రియ, సంస్థాగత విస్తరణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం మామిడి సైదులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత ఎల్లయ్యను నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిచయం చేశారు. జిల్లా పరిధిలోని అన్ని డివిజన్లు, మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యోగులు, సామాజిక వర్గ ప్రజలను సమన్వయం చేసుకుంటూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. సంస్థ లక్ష్యాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అణగారిన వర్గాల హక్కుల సాధన, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా చర్చించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- కలెక్టరేట్ లో ఘనంగా ఐక్యతా దినోత్సవ వేడుకలు

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)31 అక్టోబర్ 2026

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. భారత తొలి ఉప ప్రధాని, మాజీ హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అధికారులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి పటేల్ అని కొనియాడారు. అధికారులు, సిబ్బంది అంతా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని తెలిపారు. ఐక్యతా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

కామారెడ్డి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ, సిబ్బంది కిషన్ నాయక్, శంకర్, కపిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి: తాళ్లపెల్లి రాజేశ్వర్

జన్నారం, అక్టోబర్ 31 (వుదయం విలేఖరి)

ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ ఓటు ద్వారా నాయకులను ఎన్నుకుంటే, ఎన్నికైన నాయకులు అభివృద్ధిని విస్మరిస్తున్నారని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర చైర్మన్ తాళ్లపెల్లి రాజేశ్వర్ అన్నారు. శనివారం స్థానిక జ్యోతి గార్డెన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల భవిష్యత్తు, సామాజిక న్యాయం, మండల సమగ్ర అభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే, నాయకులు ఎన్నికల్లో హామీలిచ్చి గెలిచాక అభివృద్ధిని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో విద్య, వైద్యం పేద ప్రజలకు అందడం లేదని, ఉపాధి లేక యువత భవిష్యత్తు కోల్పోతోందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలకు నాయకులపై నమ్మకం సన్నగిల్లి రాజకీయ అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడుతున్నారని, అన్ని వర్గాలు ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు అజ్మీర నందు నాయక్, బీసీ సంఘం నాయకులు కాశెట్టి చెట్పల్లి సత్యం, లక్ష్మణ్, నర్సింలు, కోదూరు చంద్రయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు భరత్ కుమార్, జేఏసీ నాయకులు మోతే పురుషోత్తం, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇంచార్జ్ కొండకూరి ప్రభుదాస్, జిల్లా నాయకులు మూల భాస్కర్ గౌడ్, కోడి జుట్టు రాజన్న, మంద రాజేష్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు జోనుగురి మల్లయ్య, సీపీఎం నాయకులు కొండ గుర్రాలింగన్న, బుచ్చయ్య, సంజీవ్, ఆదివాసీ నాయకులు కాళీ, వివిధ కుల సంఘాలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు

కొర్టా–చనాకా ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరిపించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 31 :

కొర్టా–చనాకా ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు, కాలువల దుస్థితిపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే నిర్మాణ పనులు, కాలువల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాలువలు నాసిరకం పనుల కారణంగా దెబ్బతిని కూలిపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. పనుల కేటాయింపు, అమలు, పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పాత్రనూ విచారణ పరిధిలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులు, ఇతరుల నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని స్పష్టం చేశారు. సుమారు రూ.1,500 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ, కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో పాటు పూర్తయిన పనులు కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. దీంతో రైతులకు ఆశించిన ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రజాధన పరిరక్షణ దృష్ట్యా ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఉన్నతస్థాయి విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని, తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

బియ్యం ధరల నియంత్రణకు తహసీల్దార్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిఘా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అన్ని రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె బియ్యం ధరల నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల వరకు కిలో బియ్యం ధర రూ.55 నుంచి రూ.60 వరకు ఉండగా, ప్రస్తుతం సూపర్ మార్కెట్లలో సైతం రూ75 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నట్లు అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.

ధరల పెరుగుదలతో వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం బియ్యం రకాలను బట్టి గరిష్ఠ విక్రయ ధరలను నిర్దేశించిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ/కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రకం రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రకం రూ.79కు మించి విక్రయించరాదని స్పష్టం చేశారు. ఈ ధరలకు సంబంధించిన ఫ్లెక్సీలను రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు తమ పరిధిలోని వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని దుకాణాల్లో ధరల పట్టికలను వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా కఠిన నిఘా ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారులకు, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఉద్దేశించిన విధంగా సన్నబియ్యం సరఫరా జరిగేలా చూడాలన్నారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినా, లబ్ధిదారులకు తక్కువ పరిమాణంలో పంపిణీ చేసినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే రేషన్ దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. బియ్యం ధరల నియంత్రణ, అక్రమ నిల్వలు, బియ్యాన్ని పక్కదారి పట్టించే చర్యలపై నిరంతర నిఘా ఉంచాలని, వ్యాపారులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, , డి.సి.ఎస్.ఓ గంప శ్రీనివాస్, డి.ఎం రవి నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అనుప్రియ, క్రిస్టినా, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో వార్డుల్లో అభివృద్ధి పనులు

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

లక్షెట్టిపేట, అక్టోబర్ 31 (వుదయం న్యూస్):



మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.18 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించి, సుమారు రూ.18 లక్షల వ్యయంతో పనులు చేపట్టేందుకు ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మోత్కురి రాజేశ్వరి, కమిషనర్ కె. విజయ్ కుమార్, మేనేజర్ కె. రాజశేఖర్, ఎంఏఈ ఆఫ్రీన్, ఆర్ఐ టి. రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కందుల రాజేష్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బిఆర్ఎస్ ను విమర్శిస్తే కాంగ్రెస్ కు మద్దతు తెలుపుతున్నట్లు కాదు:?

సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఈ రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని ప్రసంగించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఇంద్రవెల్లి సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత గారు తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో అసెంబ్లీలో మరియు బయట తాను బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తప్పుపడితే తాను కాంగ్రెస్ కు మద్దతు తెలుపుతున్నానని అనడం విచిత్రంగా ఉందని అన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో మొదటి ముద్దాయి కేసీఆర్ అని, రెండవ ముద్దాయి రేవంత్ రెడ్డి అని అన్నారు. 10 సంవత్సరాలు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సైట్ ను సందర్శించని కేసీఆర్ గానీ, కవిత గానీ ఈ రోజు ప్రాణహిత ప్రాజెక్టుపై మొసలి కన్నీరు కార్చడం విచిత్రంగా ఉందని అన్నారు.

ప్రజా సేవలో ఉన్న నాయకులపై అవాకులు చెవాకులు పేలి చులకన కావద్దని హితవు పలికారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ అంతర్ధానం కానుందని, ఇటువంటి సమయంలో బిఆర్ఎస్ ను ప్రధాన ప్రత్యర్థిగా ఎంచుకుని తాము విమర్శనాస్త్రాలు సంధిస్తుంటే ఓర్వలేక పోతున్నారని తెలిపారు ఈ వ్యవహారం చూస్తుంటే కల్వకుంట్ల కవిత గారు కేసీఆర్ విడిచిన బాణమే అని అర్థమవుతుందని అన్నారు. బిఆర్ఎస్ ను విమర్శిస్తే కల్వకుంట్ల కవిత

కి ఎందుకు బాధ కలుగుతుందని ఎద్దేవా చేశారు . ఈ మీడియా సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, చిప్పకుర్తి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, కొండ్ర మనోహర్ గౌడ్, దెబ్బటి శ్రీనివాస్, అరుణ్ లోయా, కైతోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మై భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీ

కామారెడ్డి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):-

దేశ సమగ్రతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కామారెడ్డిలో రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) ర్యాలీ ప్రత్యేక కార్యక్రమాన్ని వీఆర్కే ఆధ్వర్యంలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆర్కే సీఈఓ జైపాల్ రెడ్డి, మై భారత్ డీవైఓ రమేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కామారెడ్డి రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్ ముఖ్య అతిథులుగా, సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) రంజిత్ అతిథిగా హాజరయ్యారు. వివిధ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

ఘనంగా ప్రారంభమైన ఐక్యతా ర్యాలీ సిఐ జెండా ఊపి ఈ జాతీయ ఐక్యతా ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులంతా దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగుతూ నిజాంసాగర్ రోడ్డులోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ.. భారతదేశ ఔన్నత్యానికి, అఖండ భారత నిర్మాణానికి సర్దార్ వల్లభాయ్ పటేల్

చేసిన విశేష కృషిని కొనియాడారు. మన దేశంలో భౌగోళికంగా, సాంస్కృతికంగా, భాషా పరంగా, ప్రాంతీయంగా ఎన్నో భేదాలు, వైవిధ్యాలు ఉన్నప్పటికీ.. జాతి అంతా ఒక్కటిగా నిలబడడానికి పటేల్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రజలందరూ కలిసిమెలిసి ఐక్యంగా ఉంటేనే దేశానికి ఎంతో లాభం చేకూరుతుందని, అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేస్తూ అందరికీ రాష్ట్రీయ ఏక్తా దివస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ నవీన్ కుమార్, కోఆర్డినేటర్ అమృత దత్తాత్రి, వీఆర్కే ప్రిన్సిపల్ నరేష్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

కామారెడ్డి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):-

దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని ఐకమత్యంగా ఉంచడంలో కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. దేశానికి దిశ, నిర్దేశం చేసిన ఆయన చిరస్మరణీయుడని అన్నారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకిత మవుతానని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని జిల్లా కలెక్టర్ అధికారులు, ఉద్యోగులచే రాష్ట్రీయ ఏక్తా

దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డి ఆర్ ఓ పాండు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు ఘన నివాళులు

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 31 అక్టోబర్ 2026

భారతరత్న, ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ జీవితం త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తికి ప్రతీక అని, ఆయన ఆదర్శాలు ప్రతి భారతీయ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించి, ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన సేవలను భారత ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 31 :

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలు, దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్ అన్నారు. ఛలో ఢిల్లీ–ఓట్ బచావో, దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి చేరుకున్న ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం ఇందిరా భవన్‌లో ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా నరేశ్ జాదవ్ మాట్లాడుతూ..దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బ్యాంకుల జాతీయకరణ, పేదల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశ

చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, డాక్టర్ వెన్నెల గద్దర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతే దేశానికి పునాది

- జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య
- ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

మంచిర్యాల /రామకృష్ణాపూర్/అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి)

జాతీయ ఐక్యతే దేశానికి పునాది అని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య ఆధ్వర్యంలో, చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశంతో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏకతా దివస్) కార్యక్రమాలను నిర్వహించారు.ముందుగా క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం 34 అంశాలతో కూడిన ఎజెండాను మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి. ఆరిఫ్ ప్రతిపాదించి, కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం ఎజెండాలోని అంశాలపై చర్చించి, కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏకతా దివస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ

సందర్భంగా దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సంకల్పిస్తూ కౌన్సిల్ సభ్యులు, కార్యాలయ సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు కొత్త బోర్డింగ్ పాయింట్లు

ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకునే సదుపాయం

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ కొత్త బోర్డింగ్ పాయింట్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. ప్రయాణికులు సోమగూడెం బోర్డింగ్ పాయింట్‌ను ఎంపిక చేసుకొని హైదరాబాద్‌కు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వచ్చే ప్రయాణికుల కోసం జేబీఎస్, కార్ఖానా, లాల్‌బజార్, లోత్కుంట, అల్వాల్, హకీంపేట్, తూంకుంట, షామీర్‌పేట్ ప్రాంతాల్లో బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు మొబైల్ లేదా ఇంటర్నెట్ ద్వారా tgsrtcbus.i n](https:// tgsrtcbus.in? utm_source =chatgpt.com వెబ్‌సైట్‌ను సందర్శించి ముందస్తుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వొల్లాల లచ్చన్న కన్నుమూత

దండేపల్లి: అక్టోబర్ 31 (వుదయం విలేఖరి)

దండేపల్లి మండల కేంద్రానికి చెందిన మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు,విశ్రాంత ఉపాధ్యాయుడు వోల్లాల లచ్చన్న (బాపు) శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు.సంఘం అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన ఆయన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి విశేష సేవలందించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ అందరి మన్ననలు పొందారు.ఆయన మృతి పట్ల విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి మండలానికి తీరని లోటని పేర్కొన్నారు.

లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ వద్ద మళ్లీ కంటి పరీక్షలు

సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ వద్ద వైద్య సేవలు అందిస్తున్న లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ ను శనివారం రోజు సందర్శించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగ సమయంలో కంటి పరీక్షలు నిర్వహించడం తో చాలామంది రోగులు సేవలను వినియోగించుకోలేకపోయారని అన్నారు. అందువలన రేపు మరియు ఎల్లుండి (అనగా తేదీ 1-11-26 మరియు 2-11-26) రెండు రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించడానికి లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. కావున కంటి పరీక్షలు అవ

సరమైన వారు, కంటి చూపు మందగించిన వారు మరియు శస్త్ర చికిత్సలు అవసరమైన వారు రేపు మరియు ఎల్లుండి ఈ వైద్య శిబిరంలో డాక్టర్లను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

రెండవ తరగతి ఆంగ్ల రెమిడియల్ వర్క్ బుక్ ఆవిష్కరణ

మంచిర్యాల,అక్టోబర్ 31 (వుదయం విలేఖరి)

రెండవ తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా రెమిడియల్ తరగతుల కోసం జన్నారం మండలంలోని రేండ్లగూడ ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయురాలు గుండ శ్రీలత రూపొందించిన వర్క్ బుక్ ను జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య జిల్లా కలెక్టరేట్ లోని అడిషనల్ కలెక్టర్ ఛాంబర్ లో శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు రెమిడియల్ బోధనలో ఈ వర్క్ బుక్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనకు ఇటువంటి బోధనా సామగ్రి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బోధనా పద్ధతులు అవలంబించాలని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు.వర్క్ బుక్ రూపొందించిన గుండ శ్రీలతను ఏంఈఓ బి.రాజేందర్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి. రాజన్న,నడిమెట్ల విజయ్ కుమార్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు క్వాలిటీ కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం. భరత్ కుమార్, జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ ఎం. విజయలక్ష్మి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ ఎ. రాజ్ కుమార్, ఎఫ్ఎల్ఎన్ టీమ్ లీడర్ ఎస్. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు ఉపాధి కల్పించేందుకు చర్యలు

ఎంపిడిఓ జె ఆర్ ప్రసాద్

దండేపల్లి: అక్టోబర్ 31 (వుదయం విలేఖరి)

ప్రతి నిరుపేదకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని దండేపల్లి ఎంపిడిఓ జె ఆర్ ప్రసాద్ తెలిపారు.దండేపల్లి మండలంలోని మాకులపేట గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న VB-G RAMG పనులను ఆయన శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు ఈ పని ద్వారా లబ్ధి పొందాలని అన్నారు. అధికారులు,కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా అందరితో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,అధికారులు, కూలీలు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో పటేల్ జయంతి వేడుకలు

మంచిర్యాల/మందమర్రి అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (జాతీయ ఐక్యత దినోత్సవం) సందర్భంగా మందమర్రి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 562 సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి దేశ ఐక్యతకు కృషి చేసిన సర్దార్ పటేల్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఐక్యతతో పనిచేస్తూ, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించి మందమర్రి ఏరియాను సంస్థలో మొదటి స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం జి.ఎల్.

ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీవైపీఎం సందీప్, సీనియర్ పీఓ సత్యనారాయణ, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ మెంబర్ సి.వి. రమణతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బియ్యం దుకాణాల్లో సివిల్ సప్లై తనిఖీలు

కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

లక్షెట్టిపేట, అక్టోబర్ 31 (వుదయం న్యూస్):

పట్టణంలోని బియ్యం దుకాణాలపై సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ భూమేష్ ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు బియ్యం దుకాణాలను సందర్శించి, వినియోగదారులకు బియ్యం సంచులను ఏ ధరలకు, ఏ విధంగా విక్రయిస్తున్నారనే విషయాలను పరిశీలించారు.బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినియోగదారులకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఈ ఎస్టి శంకర్, రజనీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర

కామారెడ్డి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు (నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్– 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజాధనానికి నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

లక్షెట్టిపేట ఎంపీడీఓగా అనిల్ కుమార్ బాధ్యతల స్వీకరణ

లక్షెట్టిపేట, అక్టోబర్ 31 (వుదయం న్యూస్):

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీఓ) గోసుకుల అనిల్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన మధుసూదన్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందడంతో, ప్రస్తుతం ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న అనిల్ కుమార్‌కు ఎంపీడీఓ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.ఈ మేరకు జిల్లా జడ్పీ సీఈఓ గణపతి ఉత్తర్వులు జారీ చేయగా, అనిల్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

పేద కుటుంబానికి ఎమ్మెల్యే ఐదు వేల ఆర్థిక సహాయం..

దండేపల్లి: అక్టోబర్ 31 (వుదయం విలేఖరి)

మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన బోయిని చంద్రయ్య (70) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది.ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మానవతా దృక్పథంతో స్పందించి ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు ఆకుల దుర్గ ప్రసాద్,పార్టీ కార్యకర్తలు తాళ్లపేటలోని మృతుడి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.చంద్రయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే తరపున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ అధ్యక్షులు నిహాల్ ఖాన్,నాయకులు సందేల తిరుపతి,ఎరుకల సంఘము అధ్యక్షులు ఎల్లయ్య,వార్డు మెంబర్ కోవ నవీన్,దుర్గం రవీందర్,జీలపెల్లి వినయ్, మలేం రాకేష్,రాజన్న, సురేష్,ఈర్ల రాజేందర్, శోహెల్ ఖాన్,అంజి, గణేష్,సలీమ్ ఖాన్, శివకృష్ణ,గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

లక్షెట్టిపేట, అక్టోబర్ 31 (వుదయం న్యూస్):

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంచిర్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి, కమిషనర్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. అనంతరంమండల విద్యాధికారి శైలజ మాట్లాడుతూ.. పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మంచిర్యాల జిల్లా ఎస్జిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం డి యాకుబ్, ఉపాధ్యాయులు, పీఈటీలు, వివిధ పాఠశాలల విద్యార్థినులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల పరిహారం కోసం ప్రజావాణిలో ఫిర్యాదు

టిజిడబ్ల్యూడబ్ల్యూసీ ప్రతినిధులకు అధికారుల సన్మానం

జన్నారం,అక్టోబర్ 31 (వుదయం విలేఖరి)

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మానవతా దృక్పథంతో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు కొనియాడారు.వరంగల్ చింతల్ కు చెందిన సయ్యద్ ముస్తఫా కొద్ది రోజుల క్రితం సౌదీ అరేబియాలో మరణించారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారికి రూ.5 లక్షల పరిహారం అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.సౌదీలో ఉపాధి నిమిత్తం వెళ్లిన ముస్తఫా మరణంతో భార్య, కూతురు అనాథలుగా మిగిలారు. బాధిత కుటుంబ సభ్యులను హైదరాబాద్ లోని ప్రజావాణి కేంద్రానికి తీసుకెళ్లి అధికారులతో మాట్లాడి, సీఎం ప్రవాసి ప్రజావాణిలో భార్య అలియా ఫాతిమా, కుమార్తె అమీరా ఫాతిమాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఫిర్యాదు చేశారు.గల్ఫ్ కార్మికుల పరిరక్షణకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కొన్నేళ్లుగా నిరంతరం కృషి చేస్తోందని భావించిన ప్రభుత్వ అధికారులు ప్రజా భవన్ లో ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి, ఎన్నారై సెల్ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డిలు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య, కన్వీనర్ సంద సుదర్శన్ లను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ తనీష్ మునుగోటి, వాలంటీర్లు గంగుల మురళీధర్ రెడ్డి, జయశ్రీ గూడూరి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- గంజాయి సాగు గుర్తిస్తే కఠిన చర్యలు
  – చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలి
- జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్ఎస్ఓఆర్డీ) సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాల చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గంజాయి సాగుదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం, కొరియర్లు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ–అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. డీ–అడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ శాఖ, సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమారస్వామి, జిల్లా పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్
- ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

మెట్ పల్లి అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

మెట్పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు వివిధ అభివృద్ధి పనులను శనివారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు అనంతరం కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ పరిశీలించారు పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదులు డార్మెటరీ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు అనంతరం పాఠశాలలోని వంట గదిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు వంటగదిలో నిల్వ ఉంచిన వంట నూనె ప్యాకెట్లు ఇతర వంట సామగ్రి నిత్యావసర వస్తువులను పరిశీలించి వాటి నాణ్యత నిల్వ విధానాలపై ఆరా తీశారు వంటగదిలో పరిశుభ్రత పాటించాలని విద్యార్థినులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు అనంతరం విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించి వారి చదువు వసతులు భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థినులకు నాణ్యమైన రుచికరమైన పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు భోజనం తయారీలో పరిశుభ్రత పాటించాలని విద్యార్థినుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు విద్యార్థినులకు అందించే ఆహారంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు విద్యార్థినులకు మెరుగైన విద్య, వసతి సదుపాయాలు కల్పించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి డీఈఓ రాము సంబంధిత అధికారులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ వల్లభాయ్ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, మాట్లాడుతూ.. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు. దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు అందిస్తామని, ఉద్యోగులతో అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం

- జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్
- ఆకస్మికంగా పెట్రోలింగ్ వ్యవస్థను తనిఖీ చేసిన ఎస్పీ

జగిత్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ తెలిపారు అసాంఘిక కార్యకలాపాలు చట్టవ్యతిరేక చర్యలు దొంగతనాలు తదితర ఘటనలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్ పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు ఈ నేపథ్యంలో నిన్న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ జగిత్యాల మెట్ పల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు సమయానుకూలంగా స్పందిస్తూ నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు ముఖ్యంగా దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలు చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేశామని పేర్కొన్నారు జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మెట్పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి
- వైద్యులతో సమీక్షించిన కలెక్టర్

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

మెట్పల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలు వైద్య పరికరాలు ఇతర ఏర్పాట్లను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు అనంతరం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు వైద్య సిబ్బంది హాజరు మందుల లభ్యత తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యం కోసం వచ్చే ప్రజల పట్ల వైద్యులు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఆసుపత్రులలో పారిశుద్ధ్యం రోగులకు అవసరమైన సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మెట్పల్లి ఆర్డీఓ నరసింహారావు కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి వైద్యులు వైద్య సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేధింపులపై భయమెందుకు.. పోరాడే హక్కు మీకుంది!

- కస్తూర్బా పాఠశాలలో పోక్సో చట్టం, బాలల హక్కులపై అవగాహన..
- ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది

ముత్తారం అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):

సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టం, లైంగిక నేరాల నుంచి రక్షణ,బాలల హక్కులు,వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జడ్జి అపర్ణ మల్లాది మాట్లాడుతూ.. బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని,ఎలాంటి లైంగిక వేధింపులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.బాలల రక్షణకు పోక్సో చట్టం అండగా ఉంటుందని, ప్రతి విద్యార్థి వ్యక్తిగత భద్రతపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.అనంతరం న్యాయవాదులు సదన్ కుమార్,రెండ్ల సతీష్ మహిళలపై జరుగుతున్న సంఘటనలు,మహిళా శక్తి, ఆత్మస్థైర్యాన్ని వివరిస్తూ పాటలు పాడి విద్యార్థులను అలరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. రఘోత్తం రెడ్డి,ఎస్సై రాజ్ కుమార్,న్యాయవాదులు శశిభూషణ్ కాచే,మంథని శ్రీనివాస్,కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఈ వేస్ట్ పై అవగాహన

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణ రకాల పంపులో గల రైజింగ్ స్కూల్లో మిషన్ లైఫ్ పర్యావరణ లక్ష్యాలలో రైజింగ్ స్కూల్ విద్యార్థులను క్రియాశీల భాగస్వామ్యం చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ కూడేల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు ఇంట్లో స్కూల్లో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా గుర్తించి సానిటరీ వ్యర్థాలను ముడివేర్థాలను తడి వ్యర్థాలను గుర్తించి దేనికి ఏ విధమైన డస్ట్ బిన్ లను ఉపయోగించాలో వివరించారు దీని ద్వారా రాబోయే తరంలో విద్యార్థులలో డిజిటల్ వ్యర్థాలపై పర్యావరణ పరిరక్షణ కు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కూడేల లలిత డైరెక్టర్లు చిప్ప మోహన్ షహనాజ్ బేగం కోఆర్డినేటర్ కవిత సుమయ్య సంజన లత భవాని రమ్య విద్యారాణి జ్యోతి సాయి ప్రియ సహస్ర కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

దేశ ఐక్యతకు మార్గదర్శకుడైన వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని స్మరించుకుందాం

- జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్
- సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహణ

జగిత్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

స్వాతంత్ర్య సమరయోధుడు భారతదేశ తొలి ఉప ప్రధాన మంత్రి భారతరత్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా సూపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్ ని పురస్కరించుకుని ఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు ఇట్టి ప్రతిజ్ఞలో భాగంగా మన దేశం యొక్క ఐక్యతను సమగ్రతను భద్రత ను కాపాడటానికి నన్ను నేను అంకితం చేస్తున్నానని నా తోటి ప్రజల్లోకి ఈ సందేశాన్ని పంపియటానికి నా వంతు కృషి చేస్తున్నానని ప్రమాణం చేశారు ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశ ఐక్యత సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమన్నారు స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన దూరదృష్టి నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు సర్దార్ పటేల్ సేవలను స్మరిస్తూ వారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'జాతీయ ఐక్యతా దినోత్సవం' సందర్భంగా దేశ ఐక్యత సమగ్రత సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు వేణు సైదులు శ్రీధర్ ఆర్ఎస్ఐ లు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

పెద్దపల్లి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

స్వర్గీయ భారతదేశ మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారి 42వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో గౌరవ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే, శ్రీ చింతకుంట విజయరమణ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భూతగడ్డ సంపత్ గారి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు సంపత్ గారు మాట్లాడుతూ గౌరవ స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ గారు కాంగ్రెస్ పార్టీకి అహర్నిశలు కృషిచేసి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల అందించారన్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా భారతదేశ ప్రజల హృదయాలలో ఆమె చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. వారి బాటలోనే వారి కుటుంబ సభ్యులు శ్రీమతి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ గారు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అదేవిధంగా పెద్దపల్లి కాంగ్రెస్ పట్టణ కార్యకర్తలు అందరం కూడా ఇందిరా గాంధీ గారి స్ఫూర్తితో వారి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరం శ్రాయ శక్తుల కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీ కటుకూరి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ బొడ్డుపల్లి శ్రీనివాస్, తాడూరు శ్రీమాన్ కౌన్సిలర్లు శ్రీ నాంసాని శ్రీనివాస్, కమల్, తోట పనింద్ర భూపతి, ఉనుకొండ సరస్వతి, షంషీర్, పూరేళ్ళ సుధాకర్, నదీమ్, గంగుల వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకర్, బుర్ర తిరుపతి,కొలిపాక శ్రావణ్, అమిరశెట్టి సతీష్, మానుపాటి రవి, బీమోజు సురేందర్, కాజపాష,తాళ్ల కళ్యాణ్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

భారతదేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ అన్నారు ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంతతో కలిసి తిరుమల గంగాధర్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు భారతదేశ అభివృద్ధి పేదల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణ నియమని అన్నారు దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దృఢమైన నాయకత్వాన్ని అందించారని బ్యాంకుల జాతీయి కరణ రాజభరణాల రద్దు వంటి కీలక నిర్ణయాలతో సామాజిక ఆర్థిక మార్పులకు బాటలు వేశారని గుర్తు చేశారు పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆమె ఇచ్చిన గరీబి హటావో నినాదం ప్రజల్లో ఆశలు నింపిందన్నారు దేశ ఐక్యత సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆమె స్ఫూర్తితో ప్రజా సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం వెంకటేశ్వర దేవాలయ చైర్మెన్ ఏతిరాజం నర్సయ్య కౌన్సిలర్ తోట గంగాధర్ నాయకులు ఏడ్ల రమేష్ మేడిపల్లి శేఖర్ రెడ్డి తెడ్డు విజయ్ మ్యాకల నర్సయ్య ఏంబేరి సత్యనారాయణ వెంకటేష్ గోడికే రాజ్ కిషన్ ఇల్లెందుల శ్రీధర్ మాజీ కౌన్సిలర్ రియాజ్ పండిత్ రాజేశ్వర్ పెరుమాండ్ల సత్యనారాయణ మాసపురం వెంకన్న కీసర అశోక్ రాకేష్ దర్శనం రాజు ఎడ్ల గణేష్ ప్రశాంత్ , పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

పెద్దపల్లి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

రత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను దేశ సమగ్రత అభివృద్ధి కోసం ఆమె అందించిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య రామగుండం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్తఫా, బొంతల రాజేష్, ధీటి బాలరాజు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం నవ నిర్మాణమే కర్తవ్యం

ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్

పెద్దపల్లి, (గోదావరిఖని) అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

నిరుపేద వర్గాల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని జంగాలపల్లి (ఎన్టిపిసి) లో 634 మంది లబ్ధిదారులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను అందజేశారు. లబ్ధిదారులకు ఇండ్ల తాళాలను అప్పగించారు. సందర్భంగా ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు ప్రసంగించారు. రామగుండం అభివృద్ధి కోసం... ప్రజల సంక్షేమం కోసం... రక్షకుడిగా ఉంటానని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని పాలకుల కుట్రపూరిత నిర్ణయాల మూలంగా రామగుండం వెనుకబడిందని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనులు...విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ కర్మాగారాలతో మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా వీరాంజనేయ ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని... అయితే రామగుండం నవనిర్మాణమే తన ముందున్న ప్రధాన కర్తవ్యం అని మక్కన్ సింగ్ స్పష్టం చేశారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక నగరంగా రామగుండం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని , అందుకు తాను ముందుండి పని చేస్తానని ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. విమర్శలకు ఆరోపణలకు భయపడేది లేదని రామగుండం ప్రజానీకం కూడా ఎవరికి భయపడొద్దని...దళారీ వ్యవస్థను అడ్డుకుంటాం... ఓట్ల కోసం రాజకీయం చేయడం మాకు చాతకాదనీ మక్కాన్సింగ్ నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, ఇన్చార్జి కమిషనర్ అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తోపాటు కార్పొరేటర్లు, వేలాదిమంది లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

భారత చరిత్రలో ధీరవనిత.. ఇందిరమ్మకు ఘన నివాళి

- నాయకత్వ పటిమకు ప్రతీక.. ఉక్కు మహిళ ఇందిరా గాంధీ
- సర్పంచ్ పెగడ తిరుమల కుమార్

ముత్తారం,అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):

భారత తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి వేడుకలను శనివారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేషన్‌పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ పార్టీ , కేషన్‌పల్లి గ్రామ సర్పంచ్ పెగడ తిరుమల కుమార్,ముత్తారం మండల అధ్యక్షుడు బక్కతాట్ల వినీత్,ఉప సర్పంచ్ సింగవేన సదయ్య తదితరులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతాట్ల వినీత్ మాట్లాడుతూ..ఇందిరా గాంధీ ధైర్యసాహసాలకు,దృఢ సంకల్పానికి,సమర్థ నాయకత్వానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. దేశ అభ్యున్నతికి ఇందిరా గాంధీ చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని,అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన ధీశాలి ఆమె అని అన్నారు.ఎన్నో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ దేశానికి బలమైన నాయకత్వాన్ని అందించిన ఆమె జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.భారత రాజకీయ చరిత్రలో మహిళా నాయకత్వానికి సరికొత్త నిర్వచనం చెప్పిన ఇందిరా గాంధీ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శమని బక్కతాట్ల వినీత్ అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో రోడ్డుపై కుప్పకూలిన మహిళ.. ప్రాణాపాయంలో ఆపన్నహస్తం

విధి నిర్వహణలోనూ మానవత్వం చాటిన ఎల్లారెడ్డిపేట పోలీసులు

రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

ప్రజల రక్షణే కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ తాము ముందుంటామని ఎల్లారెడ్డిపేట పోలీసులు నిరూపించారు. ఫిట్స్ రావడంతో రోడ్డుపై కుప్పకూలిన ఓ మహిళకు సకాలంలో స్పందించి ప్రథమ చికిత్స అందించి మానవత్వాన్ని చాటుకున్నారు,ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డుపై శనివారం ఉదయం ఓ మహిళకు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో రోడ్డుపై పడిపోయింది అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా అటుగా వెళ్తున్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ చారిలు మహిళ పరిస్థితిని గమనించారు క్షణం ఆలస్యం చేయకుండా ఆమె వద్దకు చేరుకున్న పోలీసులు వెంటనే ప్రథమ చికిత్స అందించారు. మహిళకు ధైర్యం చెబుతూ చేతులు, కాళ్లు రుద్దడంతో కొద్దిసేపటికి ఆమె స్పృహలోకి వచ్చింది, ఆపదలో ఉన్న మహిళకు సకాలంలో స్పందించి సాయం అందించడంతో అక్కడి వారు ఊపిరిపీల్చుకున్నారు,విధి నిర్వహణను బాధ్యతగా నిర్వర్తిస్తూనే ఆపదలో ఉన్న తోటి మనిషికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటిన కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ చారిలపై మండల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు,పోలీసులంటే కేవలం శాంతిభద్రతల పరిరక్షకులే కాదు.. ఆపదలో ఆదుకునే ఆపన్నహస్తాలని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

- దేశ ఐక్యతకు సమగ్రతకు సర్దార్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం
- కస్తూరి లక్ష్మీనారాయణ మాడవేణి నరేష్

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో బాలాజీ రోడ్ రాంనగర్ చౌరస్తా లో గల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలnu నిర్వహించారు ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా కస్తూరి లక్ష్మీనారాయణ మాడవేడి నరేష్ లు మాట్లాడుతూ భారతదేశ ఐక్యత సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు పటేల్ అని కొని యాడారు ఆయన జీవితం నేటి తరానికి దేశభక్తి కర్తవ్యనిష్ఠ ఐక్యతకు గొప్ప స్ఫూర్తి అని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్ ,చెట్లపల్లి సాగర్ మ్యకల గణేష్ ఉపాధ్యక్షులు మైదం సత్యనారాయణ తాళ్లపెల్లి శ్రీనివాస్ గోనెల రాజశేఖర్ కార్యదర్శులు బాల్క ప్రేమ్ సాగర్ చిట్యాల రాజేంద్ర కుమార్ నారవేణి విజయ్ ఒళ్ళుజి నగేష్ రాధారావు సత్యనారాయణ ఉప్పులూటి రాఘవులు గోనే రాజారాం సీనియర్ నాయకులు సాడిగే మహేష్ బీజేవైఎం అధ్యక్షులు దమ్మ సంతోష్ రెడ్డి దళిత మోర్చా అధ్యక్షులు బెక్కం అశోక్ కిసాన్ మోర్చా అధ్యక్షులు మామిడి మల్లేష్ రెడ్డి బీజేవైఎం జిల్లా మీడియా కోకన్వీనర్ దామ శ్రావణ్ కుమార్ బిజెపి బీజేవైఎం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారత ఐక్యతకు ప్రతీక – ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

రామడుగు,అక్టోబర్31(వుదయం ప్రతినిధి)

రామడుగు మండల కేంద్రంలోనిబీజేపీ రామడుగు మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘనంగానివాళులుఅర్పించారుకరీంనగర్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు మాట్లాడుతూ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఆయన ధైర్యం, దూరదృష్టి, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజ్ వైఎం మండల ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి లక్ష్మణ్, బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ మాడిశెట్టి జయంత్, ఐటీ సెల్ కో కన్వీనర్ మూల వంశీ, బూత్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్, నాయకులు పురేళ్ల రాజశేఖర్, వద్లూరి రాజేందర్, గొనేపల్లి రాజశేఖర్, ఉత్తేమ్ సాయి కుమార్, అనుపురం రవి, పెసరి ఎల్లయ్య, మల్లేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షిత్ బచ్పన్ అభియాన్ పై అవగాహన సదస్సు

పెద్దపల్లి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

సురక్షిత్ బచ్పన్ అభియాన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గౌరవ అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్న రాణి గారి అధ్యక్షతన నేడు నిమ్మనపల్లిలోని పల్లవి స్కూలులో పోక్సో చట్టం 2012 మరియు బాలల హక్కుల పరిరక్షణ వేధింపుల నివారణ లక్ష్యంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడినది ఈ ఈ అవగాహన సదస్సులో విద్యార్థులకు ఫోక్సో చట్టం, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత (గుడ్ టచ్ బ్యాడ్ టచ్) గురించి చాలా సులభంగా అర్థమయ్యే రీతిగా వివరించారు బాల బాలికలకు ఎదురయ్యే వేధింపులను అరికట్టడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాఠశాల యజమాన్యాలు మరియు పోలీసు ఎంతో కీలకమని తెలిపారు అలాగే బాల బాలికలు ఏదైనా వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులకు గాని స్కూల్లో ఉన్న ఉపాధ్యాయులకు గాని దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో గాని లేదా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వచ్చి సమస్యలను వివరిస్తే న్యాయ సేవ ద్వారా సహాయము అందిస్తామని తెలిపారు అలాగే బాలల కొరకు 1098, న్యాయం సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తెలుపగలరని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిజ కోహిర్కర్, కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పెద్దపెల్లి, శ్రీనివాస్, సంకీర్తన లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, నరేష్ కల్చరల్ సెక్రెటరీ, శరత్, ఝాన్సీ మహిళా న్యాయవాదుల విభాగం పెద్దపల్లి పాల్గొన్నారు అలాగే rama ,కల్పన, shyamala డిసిపిఓ సిబ్బంది, శోభారాణి స్కూల్ కరస్పాండెంట్ వాణి ప్రిన్సిపల్ మరియు టీచర్లు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనపై ప్రమాదం.. బస్సును ఢీకొన్న బైక్

బస్సు సడన్ బ్రేక్.. ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

ముత్తారం, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ పరిధిలోని ఇరుకు వంతెన వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా ఆటో రావడంతో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయగా,వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఖమ్మంపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు సదయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి ఆయనను గోదావరిఖని ఆసుపత్రికి తరలించారు.ఏళ్లుగా ఇరుకుగానే ఉన్న ఈ వంతెనను విస్తరించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా వంతెన నిర్మాణాన్ని విస్మరించారని ఆరోపిస్తున్నారు.

మండల శాఖ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నవంబర్ 05వ తేదీన "ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం అరాచక వాదాన్ని అంతం చేద్దాం"అనే నినాదంతో మహా పాదయాత్ర నిర్వహిస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమం కొరకై శనివారం భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో బీజేపి మండల కార్యాలయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు కరీంనగర్ లో జరిగే ఈ కార్యక్రమానికి మండలం నుండి పెద్ద మొత్తంలో యువకులు దేశభక్తులు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నీ గ్రామాల నుండి శక్తి కేంద్రం ఇంచార్జ్ లు బూత్ అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా యువ మోర్చా వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం

కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి సునీతారాణి సస్పెన్షన్

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పరిపాలనా పర్యవేక్షణలో వైఫల్యం ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన కారణాలతో కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి సునీతారాణిని తక్షణమే సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు అక్టోబర్ 31న జిల్లా కలెక్టర్ కోరుట్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా సూపరింటెండెంట్ సంబంధిత సమర్థ అధికారి నుంచి ముందస్తు అనుమతి పొందకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు ఆసుపత్రి పరిపాలన సిబ్బంది పర్యవేక్షణ రోగులకు నిరంతర వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత కలిగిన అధికారి స్వయంగా అనుమతి లేకుండా గైర్హాజరు కావడాన్ని ఉత్తర్వుల్లో తీవ్రంగా పరిగణించారు అంతేకాకుండా ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందిలో దాదాపు సగం మందికి ఒకేసారి సెలవులు మంజూరు చేసినట్లు గుర్తించారు ఆసుపత్రి సేవలు నిరాటంకంగా కొనసాగేందుకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడకుండా సెలవులు మంజూరు చేయడం పరిపాలనా నిర్లక్ష్యాన్ని పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు .

ఈ నేపథ్యంలో గుర్తించిన లోపాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని చేపట్టనున్న క్రమశిక్షణ చర్యల దృష్ట్యా డాక్టర్ వి సునీతారాణిని సస్పెన్షన్‌లో ఉంచారు క్రమశిక్షణ చర్యలు ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు సస్పెన్షన్ కాలంలో జిల్లా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యస్థానాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

గోదావరి పుష్కరాల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- పుష్కర ఘాట్ల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి
- భక్తులకు సురక్షిత తాగునీరు, ఆకర్షణీయమైన లైటింగ్, పారిశుద్ధ్య నిర్వహణ ఏర్పాటు
- భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- గోదావరి పుష్కర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

పెద్దపల్లి, అక్టోబర్-31 (వుదయం ప్రతినిధి)

రానున్న గోదావరి పుష్కరాల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని,రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావుతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల పనులను నాణ్య ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, పాత ఘాట్ల మరమ్మతుల పనులు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన తాగునీరు అందించేందుకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే పుష్కర ప్రాంతాలలో భక్తులను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు ఈశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

గ్రామ అవసరాలకే మల్లన్న గడ్డ భూమి!

- ఓడేడు గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం.. భూములకు హద్దులు ఏర్పాటు చేసి గ్రామానికి కేటాయించాలని డిమాండ్
- తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం అందజేత

ముత్తారం అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):

గ్రామ ప్రజల అవసరాల కోసం గ్రామ పరిధిలోని ప్రభుత్వ, వివాదాస్పద భూములను గుర్తించి కేటాయించాలని ఓడేడు గ్రామస్తులు ఏకమయ్యారు. ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 28,29లోని మల్లన్న గడ్డ భూమిని గ్రామ ప్రజల అవసరాలకు వినియోగించాలని గ్రామస్తులు, రైతులు, ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ మేరకు గ్రామస్తులంతా కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో మల్లన్న గడ్డ భూమిని విక్రయించేందుకు లక్ష్మీనరసింహారెడ్డితో పాటు పలువురు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు.అయితే ఈ భూమి గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగపడుతుందని భావించి,దానిని విక్రయించవద్దని గ్రామస్తులు కోరడంతో లక్ష్మీనరసింహారెడ్డి విక్రయ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు.అయినప్పటికీ గ్రామ ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విక్రయానికి సంబంధించి డబ్బులు చెల్లించి భూమిని కొనుగోలు చేసినట్లు ఆరోపించారు.గ్రామ అవసరాల దృష్ట్యా భూమిని విక్రయించకుండా,విక్రయానికి సంబంధించిన డబ్బులను తిరిగి తీసుకోవాలని గ్రామస్తులంతా కోరినప్పటికీ సంబంధిత వ్యక్తులు అంగీకరించలేదని తెలిపారు.అంతేకాకుండా సదరు భూమిలో సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.అదేవిధంగా సర్వే నంబర్ 40లోని గుట్ట భూమిని కూడా కొనుగోలు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ భూములన్నీ గ్రామ ప్రజల ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సర్వే నంబర్లు 28,29లోని మల్లన్న గడ్డ భూమితో పాటు సర్వే నంబర్ 40లోని గుట్ట భూమిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.భూముల పూర్తి వివరాలను రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించి,సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా భూములను కేటాయించి భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఓడేడు గ్రామస్తులు,రైతులు,వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ సన్మానించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మహమ్మద్ అలీముద్దీన్ (ఎస్ఐ) అహ్మద్ ఖాన్ (ఏఆర్ఎస్ఐ) లను జిల్లా ఎస్పీ శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సహోద్యోగులు సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు పోలీసు శాఖలో పని చేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో వీడ్కోలు పలికారుఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు జీవన్ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యూడీఐడీ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావొద్దు

- వికలాంగులకు ఒకేరోజు వైద్య పరీక్షలు.. సత్వరమే కార్డుల జారీ
- జిల్లాలో ఇప్పటివరకు 3,590 యూడీఐడీ కార్డులు జారీ
- సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :

యూడీఐడీ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు ఒకేరోజు పూర్తిచేసి, దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. యూడీఐడీ దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ అంశాలపై శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. సెర్ప్ ద్వారా జిల్లా ఆసుపత్రులకు పంపిణీ చేసిన వైద్య పరీక్షల పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం ఆసుపత్రులకు వచ్చే వారికి అవసరమైన అన్ని పరీక్షలు ఒకేరోజు నిర్వహించి పంపించేలా సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తయిందా? లేదా? అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి యూనిఫాంలు అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తయినట్లు అధికారులు వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో యూడీఐడీ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2025 మార్చి 1 నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,590 యూడీఐడీ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం.. రక్తదానంతో ప్రాణదాతగా శ్యామ్!

ముత్తారం అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):

ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే మానవత్వమని చాటుతూ ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన శ్యామ్ రక్తదానం చేసి తన ఉదారతను చాటుకున్నారు.కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమని రజిత ఫౌండేషన్ ద్వారా సమాచారం అందడంతో శ్యామ్ స్పందించారు.వెంటనే శనివారం ఆస్పత్రికి చేరుకొని రక్తదానం చేశారు.సమయానికి రక్తం అందించి సహకరించిన రజిత ఫౌండేషన్ శ్రీనుతో పాటు రక్తదానం చేసిన శ్యామ్‌కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్గీయ ఇందిరా గాంధీ కి నివాళి

మెట్ పల్లి అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

మెట్ పల్లి పట్టణంలో టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో స్వర్గీయ ఇందిరాగాంధీ 42 వ వర్ధంతి సందర్భంగా శనివారం ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఖుతుబోద్దీన్ పాషా మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయలన్నారు ఇందిరాగాంధీ ఐరన్ లేడీ ఆఫ్ ఇండియా ఈ రోజు మన దేశానికి అపారమైన సేవ చేసిన మాజీ ప్రధాని ల దేశాల అధ్యక్షురాలు భారత రత్న ఇందిరాగాంధీ వర్ధంతి ఈమె పుట్టుకే అప్పటికి దేశంలోనే అత్యంత సంపన్నుడైన మోతీలాల్ నెహ్రూ కుటుంబంలో గోల్డెన్ స్పూన్ తో పుట్టిన సంపన్నురాలు అయినా పేదల కష్టాలను ఈమె అర్థం చేసుకున్నంత గా భారత చరిత్రలో మరెవ్వరూ అర్థం చేసుకోలేదు పేదవాడినీ అని చెప్పుకునే వ్యక్తి ఆ పేదలకు చుక్కలు చూపే పరిపాలన ఇస్తుంటే పుట్టుకే కోటీశ్వరులుగా పుట్టిన ఈమె ఈ దేశపు పేదరికాన్ని చాలా తగ్గించ గలిగారు . ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లూరి సాగర్ పట్టణ ఎన్ ఎస్ యు ఐ వైస్ ప్రెసిడెంట్ సమీర్ సర్కార్ యండి అన్వర్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు రిజ్వాన్ రియాన్ ముదసీర్ ముస్తఫా సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సేవలకు వీడ్కోలు.. పదవీ విరమణ వేళ కొమురయ్యకు ఘన గౌరవం

కౌన్సిలర్ శంకర్ చేతుల మీదుగా కొమరయ్య దంపతులకు సన్మానం

వేములవాడ అక్టోబర్ 31 : (వుదయం ప్రతినిధి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహించిన కుమ్మరి కొమురయ్య శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా 19వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి శంకర్ కొమురయ్యతో పాటు ఆయన సతీమణిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆలయంలో సుదీర్ఘకాలం సేవలందించిన కొమురయ్యకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

60 సంవత్సరాల అనంతరం కొండగట్టులో శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవం

- జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్
- కొండగట్టు చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష సమావేశం

మల్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి సుమారు 60 సంవత్సరాల అనంతరం నిర్వహించనున్న శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశించారు శనివారం ఐడీఓసీలో సంబంధిత శాఖల అధికారులతో కొండగట్టు చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అపూర్వ అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం అత్యంత విశిష్టమైనదని తెలిపారు ఈ మహోత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు నవంబర్ 15 నుంచి 20 2026 వరకు స్వామివారి చందనోత్సవం మహా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు డిసెంబర్ 29న తిరిగి స్వామివారికి మండల పూజ సింధూర లేపనం నిర్వహించనున్నట్లు వివరించారు

భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు

కార్తీక మాసం సందర్భంగా సాధారణ రోజుల కంటే ఉత్సవాల సమయంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు సాధారణ రోజుల్లో సుమారు 10 వేల మంది మంగళ శని ఆదివారాలు సెలవు దినాల్లో సుమారు 20 వేల మంది పర్వదినాల్లో 25 వేల నుంచి 30 వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు ముఖ్యంగా నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు నిర్వహించే నిజరూప దర్శనానికి రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు

భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పార్కింగ్ నుంచి దర్శనం తిరుగు ప్రయాణం వరకు ప్రతి అంశంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు ట్రాఫిక్ నియంత్రణ వాహనాల పార్కింగ్ పోలీసు బందోబస్తు ప్రత్యేక బస్సులు తాగునీటి సరఫరా వైద్య సేవలు విద్యుత్ సరఫరా పారిశుద్ధ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ఆలయ ప్రాంగణం క్యూలైన్లు పార్కింగ్ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని నిరంతరం తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు పారిశుద్ధ్య నిర్వహణకు తగిన సంఖ్యలో సిబ్బందిని నియమించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు వైద్య సేవలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదు

భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆలయ పరిసరాల్లో మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు అవసరమైన వైద్యులు వైద్య సిబ్బంది మందులు ప్రథమ చికిత్స సామగ్రి అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు ఉత్సవాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు ఆలయ ప్రాంగణం ప్రధాన రహదారులు పార్కింగ్ ప్రాంతాల్లో తగినంత విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు రెవెన్యూ శాఖ అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి పార్కింగ్ తదితర అవసరాలకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు

క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మరో విస్తృత స్థాయి సమావేశం

ప్రస్తుతం నిర్వహించిన సమావేశం చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి ప్రాథమిక సమావేశం మాత్రమేనని కలెక్టర్ తెలిపారు వచ్చే వారం ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించిన అనంతరం క్షేత్ర స్థాయిలో గుర్తించిన అవసరాలు సమస్యలు శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై మరో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు 60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అరుదైన మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీఓ మధు సుధన్ డీఎస్పి కె పురుషోత్తం రెడ్డి కొండగట్టు ఈవో ఎస్ అంజనారెడ్డి డిపిఓ మదన్మోహన్ డిఎంహెచ్వో సుజాత మిషన్ భగీరథ ఫైర్ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలు పరిష్కారంకు రాజీలేని పోరాటం

జగిత్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

పెన్షనర్ల సమస్యల పరిష్కారం కు రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు శనివారం జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో 31 అక్టోబర్ 2026 న పదవీ విరమణ పొందుతున్న జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన పలువురు ఉద్యోగులను హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘాల ప్రతినిధులు సన్మానించారు ఈసందర్భంగా వారికి టీపీసీఏ అసోసియేషన్ సభ్యత్వం సీనియర్ సిటిజన్స్ పిలుపు పత్రికలు అందజేశారు వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు పోరుబాట పట్టకుండా పీ ఆర్ సి తదితర డిసమస్యలు సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిసి హన్మంత్ రెడ్డి కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు ఎస్జి పిఏ టి అధ్యక్షులు పి అశోక్ రావు నాయకులు ఎండి యాకూబ్ సత్యనారాయణ ఎండి ఇక్బల్ సయ్యద్ యూసుఫ్ జాఫర్ పబ్బా శివానందం గంగాధర్ దుబ్బేశం యాకుబ్ హుసేన్ మురలీదర్ రాములు నారాయణ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

కోరుట్ల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మున్సిపల్ కమీషనర్ వి రాఘవేంద్ర ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని బిర్యానీ సెంటర్లు టిఫిన్ సెంటర్లో స్వీట్ హౌస్ లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్వాధీన పరుచుకొని 16 వేల రూపాయలు జరిమానాలు విధించడంతో పాటు అవగాహన కల్పించారు అలాగే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యని దుకాణా దారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ రాఘవేంద్ర మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తి స్థాయిలో నిషేదించాలని లేని యెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందని ట్రేడ్ లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలని తెలిపారు వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి పొడి హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు లేనిచో ఎస్ డబ్ల్యూ ఎ –2026 చట్టం ప్రకారం జరిమానా విధించబడునన్నారు ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ రికార్డ్ అసిస్టెంట్ జగదీష్ హేమంత్ మున్సిపల్ జవాన్ చిట్యాల రమేష్ చంద్రప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.